# షాద్‌నగర్ కోర్టులో అఘోరీ శ్రీనివాస్

-మరో 14 రోజులు రిమాండ్‌ను పొడిగించిన న్యాయమూర్తి

**షాద్‌నగర్, మే 2, ప్రభాతవార్త:** మహిళా సినీనిర్మాతను మోసగించిన కేసులో అఘోరీని మోకిలా పోలీసులు ఇటీవల అరెస్టుచేసి జైలుకు తరలించిన విషయం విదితమే. అయితే 14రోజుల రిమాండ్ ముగిసిపోవడంతో మరోసారి మోకిలా పోలీసులు అఘోరీని చేవెళ్ల కోర్టుకు తీసుకెళ్లారు. చేవెళ్ల కోర్టు ఇంచార్జి కొత్త రవి షాద్‌నగర్ కోర్టులో నూతనంగా బాధ్యతలు స్వీకరించడంతో పోలీసులు షాద్‌నగర్ కోర్టుకుతీసుకువచ్చారు. పోలీసులు అఘోరీని కోర్టులోప్రవేశపెట్టడంతో న్యాయమూర్తి అఘోరీకి రిమాండ్ మరో 14రోజులు పొడిగించారు. దీంతో అఘోరీని ప్రత్యేకవాహనంలో చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఇటీవల అఘోరీ కారులో హరిద్వార్ వెళ్తుండగా పోలీసులు ఆమెను ఉత్తరప్రదేశ్‌లో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం చేవెళ్ల కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించడంతో సంగారెడ్డి జిల్లా కంది సబ్‌జైలుకు తరలించారు. ప్రస్తుతం మరో 14 రోజులు షాద్‌నగర్ కోర్టు రిమాండ్ పొడిగించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

# లంచం తీసుకుంటూ ఏసిబికి చిక్కిన సీనియర్ అసిస్టెంట్

**వికారాబాద్, మే 2, ప్రభాతవార్త:** సహచర ఉద్యోగి అయినా సరే లంచం ఇవ్వకుంటే పనులు చేసేది లేదన్నాడు. టిఏ బిల్లు ప్రాసెస్ చేయాలంటే లంచం ఇచ్చి తీరాల్సిందేనని ఖరాఖండిగా చెప్పాడు. చివరకు ఏసిబి అధికారులకు చిక్కాడు ఓ అధికారి. వివరాల్లోకి వెళ్ళితే, వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో టి.శ్రీధర్ సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఎక్సైజ్ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి సంబంధించిన జీతభత్యాల ఫైల్స్ ప్రాసెస్ చేస్తాడు. ఇతను ఆ ఫైళ్ళను పైకి పంపితేనే ఆశాఖ ఉద్యోగులకు జీతాలు, ఇతర అలవెన్సులు వస్తాయి. ఇందులోభాగంగా తోటి ఉద్యోగికి సంబంధించిన 2022-23 సంవత్సరానికి సంబంధించిన టిఏ బిల్స్ రూ.76వేలు పెండింగ్‌లో ఉన్నాయి. దానికి సంబంధించిన ఫైల్‌ను ప్రాసెస్ చేసేందుకు సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ రూ.8 వేలు లంచం అడిగాడు. దీంతో సంబంధిత ఉద్యోగి ఏసిబి అధికారులను ఆశ్రయించాడు. ఏసిబి అధికారులు శుక్రవారం పక్కా ప్రణాళికతో రూ.8 వేలు లంచం తీసుకుంటుండగా సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్‌ను పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి రూ.8వేలు నగదు రికవరీ చేసుకుని నిందితుడిని నాంపల్లి ఏసిబి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఏసిబి డిఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపారు.

# నష్టపోయిన ప్రతి గింజకు నష్టపరిహారం

-ప్రకృతి వైపరీత్యాల్లో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇస్తాం
-షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, మే 2, ప్రభాతవార్త:**
అకాలవర్షంతో నష్టపోయిన రైతులను అన్నివిధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టంచేశారు. ఇటీవల కురిసిన వడగళ్లవానకు ఫరూఖ్‌నగర్ మండలంలోని అనేకగ్రామాల్లో వరిపంటలు దెబ్బతిన్నాయి. ఈసమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే శంకర్ హుటాహుటిన శుక్రవారం ఉదయం నష్టపోయినపంటలను పరిశీలించారు. ఫరూఖ్‌నగర్‌మండలం చిల్కమర్రి గ్రామంలో గతరాత్రి వడగండ్లవానకు దెబ్బతిన్న పంటలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా చిల్కమర్రిలో రైతులు బడికెల యాదయ్య, వెంకట్‌రెడ్డి, చిల్కమర్రి రవీందర్‌రెడ్డి, తదితరులను కలిసి పంటనష్టానికిగల కారణాలను తెలుసుకున్నారు. నష్టపోయిన రైతులను అన్నివిధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. సంబంధితశాఖ అధికారులు ప్రత్యేక దృష్టితో ప్రతి రైతు పంటనష్టాన్ని అంచనా వేయాలని వ్యవసాయశాఖ ఏడి రాజారత్నం, ఏఈ నిశాంత్‌కుమార్ తదితరులను ఆదేశించారు. రైతులసంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ఆరుగాలం కష్టపడి సాగుచేసిన పంట చేతికివచ్చేదశలో అకాల వర్షానికి నష్టపోయినందున రైతులు బాధపడుతున్నారని, నష్టపోయిన ప్రతిగింజకు నష్టపరిహారం అందించేలా కృషి చేస్తానని అన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోవడం జరిగిందని, ఇలాంటి సమయాల్లో రైతాంగాన్ని మానవతాదృక్పథంతో ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందని అన్నారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్ అలీఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు విశ్వం, మండలపార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, పట్టణపార్టీ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్‌గౌడ్, నేతలు అగ్గనూరు బస్వం, రాజేందర్‌రెడ్డి, ఇబ్రహీం, శ్రీశైలంగౌడ్, రాయికల్ శ్రీనివాస్, నవీన్, అందె మోహన్‌ముదిరాజ్, రవీందర్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి పాల్గొన్నారు.

# వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లింల నిరసన




కొడంగల్‌లో నిరసన ర్యాలీ చేపట్టిన ముస్లింలు

**కొడంగల్, మే 2, ప్రభాతవార్త:**
కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ శుక్రవారం కొడంగల్ పట్టణంలో ముస్లింలు శాంతియుత నిరసన ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని జామియా మస్జీద్ కమిటీ అధ్యక్షులు అఫ్రోజ్, మైనార్టీ నాయకులు ఎస్కే.గుల్షన్ ఆధ్వర్యంలో పట్టణంలోని వినాయక చౌరస్తానుంచి అంబేద్కర్ చౌరస్తావరకు ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రభుత్వం ముస్లింలకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో ఒక్కో బిల్లును ప్రవేశపెట్టబోతుందని విమర్శించారు. దేశవ్యాప్తంగా లక్షల ఎకరాల్లో ఉన్న వక్ఫ్‌బోర్డు భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి వక్ఫ్‌బోర్డు బిల్లుకు సవరణలు చేపట్టిందన్నారు. కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలుచేశారు. అనంతరం ర్యాలీగావెళ్ళి తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పిసిసి ప్రతినిధి ఎండి.యుసుఫ్, మైనార్టీనాయకులు హఫీజ్ అబ్దుల్‌కరీం, అఫ్రోజ్‌ఖాన్, హఫీజ్ బాసిత్, షేక్ రోమాన్, ఎండి.సర్తజ్‌హుస్సేన్, ఎండి.షాకీర్, ఏకె.యుసుఫ్, అజ్మీర్‌ఖాన్, హఫీజ్, హఫీజ్‌నసీర్, ఆసిఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

-రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్‌పార్టీ పరిశీలకుడు శివసేనారెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:**
రంగారెడ్డి జిల్లాలో దేశవ్యాప్తంగా అఖిల భారత కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు జరుగుతున్న జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా విజయవంతం చేయాలని గ్రామీణ ప్రాంతాలనుంచి పట్టణ ప్రాంతాలవరకు ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కాంగ్రెస్ శ్రేణులు కృషిచేయాలని రాష్ట్ర స్పోర్ట్స్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడు శివసేనారెడ్డి పిలుపునిచ్చారు. జిల్లాస్థాయి కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం విజయవంతంచేయాలని సీనియర్ నాయకులకు, కార్యకర్తలకు, ప్రజాప్రతినిధులకు, నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇంచార్జిలను కోరారు. ఈసమావేశం జిల్లా పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి అధ్యక్షతన కొనసాగింది. త్వరలో రంగారెడ్డిజిల్లాలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ మహాసభను వేలాదిమందితో రాష్ట్రంలోనే అత్యంత భారీసభను నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. సభ ఏర్పాట్లను జిల్లాస్థాయిలో నిర్వహించనున్నందున ప్రతి ఒక్క ఎమ్మెల్యేతోపాటు ఆయా నియోజకవర్గాలకు ఇంచార్జులుగా కొనసాగుతున్న పార్టీ సీనియర్లు, మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేషన్ల మేయర్లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు, ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టీ తదితర కాంగ్రెస్ విభాగాలకుచెందిన నాయకులంతా ఎవరికివారుగా జనసమీకరణలో తమబలాన్ని నిరూపించుకోవాలని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకివెళ్లి కాంగ్రెస్‌పార్టీ సంక్షేమ పథకాలను, చేపడుతున్న ప్రజాపాలన గురించి తెలియజెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా మహాసభ తర్వాత నియోజకవర్గాలవారీగా ఈనెల 10వ తేదీనుండి 17వ తేదీవరకు జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో నియోజకవర్గస్థాయి సభలు నిర్వహించుకోవడానికి తేదీలను ఖరారు చేసుకోవాలని శివసేనారెడ్డి ఎమ్మెల్యేలు, ఇంచార్జీలకు సూచించారు.

# వడగళ్ల వాన.. కుదేలైన రైతన్న

-ఫరూఖ్‌నగర్ మండలంలో వందలాది ఎకరాల్లో వరి పంట నష్టం



దెబ్బతిన్న పంట

**షాద్‌నగర్, మే 2, ప్రభాతవార్త:**
ఫరూఖ్‌నగర్ మండలంలో గురువారం రాత్రి కురిసిన అకాలవర్షానికి అపారనష్టం సంభవించింది. మండలంలోని చిల్కమర్రి, గంట్లవెల్లి, బూర్గుల, చింతగూడ, కమ్మదనం, తదితర గ్రామాల్లో రాత్రి కురిసిన అకాల వడగంట్ల వానకు వరి, మామిడి తదితర పంటలు నష్టపోయాయి. ఇప్పటి వరకు వ్యవసాయశాఖకు అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం 300 నుండి 400 ఎకరాల వరి, మామిడి పంటలు నష్టపోయినట్లు మండల వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్ మీడియాకు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు నష్టపోయిన గ్రామాల్లో పర్యటించి, నష్టపోయిన పంటల, రైతుల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తెలిపారు. ఒక్క చిల్కమర్రి గ్రామంలోనే దాదాపు 200 ఎకరాలకు పైగా పంట నష్టం వాటిల్లిందని ఆ గ్రామ రైతు రవీందర్ రెడ్డి మీడియాకు తెలిపారు.

# విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

-వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్
-వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా సమీక్షించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మే 2, ప్రభాతవార్త:**
రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. శుక్రవారం డా.బిఆర్ అంబేద్కర్ సచివాలయం నుండి భూభారతిచట్టం, రెవెన్యూ సదస్సులు, ఇందిరమ్మ ఇల్లు, నీట్ పరీక్ష నిర్వహణపై రెవెన్యూ, గృహ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణలు రెవెన్యూ శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా సమీక్షించారు. ఈసందర్భంగా రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, భూభారతిచట్టాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, అత్యంత పేదవారికి ఇందిరమ్మ ఇళ్లమంజూరుకోసం తీసుకోవాల్సిన ప్రమాణికలపై అధికారులకు సూచించారు. అదేవిధంగా ఈనెల 4న నిర్వహించే నీట్ ప్రవేశపరీక్ష సజావుగా జరిగేలా కావలసిన ఏర్పాటు చేసుకోవాలని మంత్రి ఈసందర్భంగా అధికారులకు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారుల ను ఉద్దేశించి మాట్లాడుతూ, రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టాన్ని అమలు చేసేందుకుగాను పైలెట్ ప్రాజెక్టు కింద భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహించి అర్జీలు స్వీకరించాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. వారసత్వ, సాదాబైనామాల, ఆర్ఎస్ఆర్, అసైన్మెంట్, ప్రభుత్వ భూముల గుర్తింపు తదితర అంశాలపై దృష్టి సారించాలని తెలిపారు. అత్యంత నిరుపేదవారికి మొదటి ప్రాధాన్యతగా ఇళ్లమంజూరుకు ప్రతిపాదనలు సిద్ధంచేయాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ద్వారా వచ్చిన జాబితాలు పరిగణనలోకి తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. మే 4న జరిగే నీట్ ప్రవేశపరీక్షకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాలు, పోలీస్ బందోబస్తు, త్రాగునీరు, మెడికల్‌క్యాంపులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేవిధంగా జాగ్రతలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్ నుండి జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్‌చౌదరి, ఆర్డిఓ వాసుచంద్ర, డిఆర్డీఓ శ్రీనివాస్, సిపిఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఇఇ కృష్ణయ్య, నీట్ సిటీ కోఆర్డినేటర్ కె.సాయిలత, తహసీల్దారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### దీర్ఘకాలిక పెండింగ్‌లోని విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి..

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్‌కు సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో విద్యుత్ శాఖలో పెండింగ్‌లో ఉన్న వివిధ అంశాలపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో జిల్లాకలెక్టర్ సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పెండింగ్ విద్యుత్‌పనులు వేగవంతం చేయాలన్నారు. 2024 సంవత్సరంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలు మే నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దరఖాస్తులు చేసుకున్నవారికి ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, మీటర్లు, బోరు కనెక్షన్‌లు సమకూర్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా పనులు పురోగతిసాధించాలని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయరంగానికి సంబంధించిన పనులు అలసత్వం చేయకూడదని అధికారులకు సూచించారు. ఈ సమీక్షాసమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్‌చౌదరి, విద్యుత్ ఎస్ఇ రవిప్రసాద్, డిఇ, ఎడిఇ, ఎఇలు పాల్గొన్నారు.




వీడియో కాన్ఫరెన్సును వీక్షిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

# ఇసుక రవాణాకు అడ్డుకట్ట పడేనా..?

-మండలంలో జోరుగా ఇసుక వ్యాపారం..
-అడుగంటుతున్న భూగర్భజలాలు..
-లంచాల మత్తులో అధికారులు..




ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్న ఇసుక

**జిల్లెడు చౌదరిగూడ, మే 2, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల మేలుకోరి అక్రమ ఇసుక రవాణాకు చెక్ పెట్టాలని ఆదేశాలు జారీచేసింది. కాని కొంత మంది కిందిస్థాయి అధికారులు ప్రభుత్వ ఆదేశాలను పక్కన పెట్టి తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఇసుకరవాణా చేయడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉంది. అందువల్లనే ప్రభుత్వం ఇసుక రవాణాను ప్రోత్సహించడం లేదు. కాని కిందిస్థాయి అధికారులు ధనార్జనేధ్యేయంగా వ్యవహరిస్తూ అక్రమ ఇసుకరవాణాను ప్రోత్సహిస్తున్నారు. ఇలాగే అక్రమ ఇసుకరవాణా కొనసాగితే ముున్ముందు అనేక ఇబ్బందులు తప్పవు.

### జోరుగా అక్రమ ఇసుక వ్యాపారం....

జిల్లెడు చౌదరిగూడ మండలంలో అక్రమ ఇసుక వ్యాపారం జోరుగా కొనసాగుతుంది. మండలంలోని లాల్‌పహాడ్‌లో ఇసుక డంప్‌చేసి చుట్టుపక్కల గ్రామాలకు సరఫరా చేస్తారు. అలాగే మండలంలోని ఆయా గ్రామాలలో ఇసుక ఫిల్టర్లు ఏర్పాటు చేసి వ్యాపారం కొనసాగిస్తున్నారు. గ్రామాలలో గల ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా జరుగుతుంది. అక్రమ ఇసుక రవాణా పట్టపగలు మండల కేంద్రంలోని ఆయా ప్రభుత్వ కార్యాలయాల ముందునుంచి వెళుతున్నా ఎవ్వరూ పట్టించుకోరు. దీంతో ఇసుక వ్యాపారులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది.

### అడుగంటుతున్న భూగర్భ జలాలు..

గ్రామాలలో ఇసుక తవ్వకాలు చేపట్టడం వల్లన భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోతున్నాయని మండల వాసులు వాపోతున్నారు. ఇప్పటికే ఎండలు ఎక్కువగా ఉండడం వల్ల బోరుబావులలో నీటిమట్టం పూర్తిగా తగ్గిపోతుంది. దీనికితోడు అక్కడక్కడ ఉన్న వాగులలో ఇసుక తవ్వకాలు చేపట్టడం, ఫిల్టర్లు ఏర్పాటు చేసి మట్టిద్వారా ఇసుక తయారు చేయడం వల్ల భూగర్భ జలాలు పూర్తిగా తగ్గిపోతున్నాయని మండల ప్రజలు అంటున్నారు.

### లంచాల మత్తులో అధికారులు..

మండలంలో అక్రమ ఇసుక వ్యాపారం జోరుగా కొనసాగడానికి అధికారులు లంచాలకు ఆశపడడమేనని మండల వాసులు వాపోతున్నారు. తమ కళ్లముందు ఇసుక వాహనాలు వెళ్తున్నా ఏమాత్రం పట్టించుకోవడంలేదని ప్రజలు అంటున్నారు. ఇసుక డంపింగ్‌లు, ఫిల్టర్ యజమానులు అధికారులకు నెలనెల మామూళ్లు ఇవ్వడం వల్లనే వారిని చూసీచూడనట్లు వదిలేస్తున్నారని అంటున్నారు. అక్రమ ఇసుక వ్యాపారం ఎక్కడా చేపట్టవద్దని రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నోసార్లు ప్రకటనలు చేసినప్పటికి కిందిస్థాయి అధికారులు మాత్రం ముఖ్యమంత్రి మాటను పెడచెవిన పెడుతున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నాతాధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాను నియంత్రించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# అన్నోజిగూడలో అక్రమకట్టడాల కూల్చివేత




పార్కుస్థలంలోని అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న మున్సిపల్ అధికారులు

**ఘట్‌కేసర్ రూరల్, మే 2, ప్రభాతవార్త:**
పోచారం మున్సిపల్ అన్నోజిగూడలో పార్కుస్థలం కబ్జాచేసి నిర్మాణాలు చేపట్టిన వాటికి ఎట్టకేలకు కమిషనర్ వీరారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు శుక్రవారం కూల్చివేసినట్లు తెలిపారు. అన్నోజిగూడలోని సర్వేనెంబరు 18,19లలో దాదాపు వెయ్యిగజాల పార్కుస్థలం ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. పార్కుస్థలాలు అక్రమణకు గురౌతున్నట్లు మీడియాలో పలుకథనాలు రావడంతో ఎట్టకేలకు స్పందించిన మున్సిపల్ సిబ్బంది కమిషనర్ ఆదేశాల మేరకు జెసిబి యంత్రసహాయంతో కూల్చివేసినట్లు తెలిపారు. కోట్లరూపాయల విలువచేసే పార్కుస్థలాన్ని రక్షించినందుకు స్థానికులు కమిషనర్‌కు అభినందనలు తెలుపుతూనే, మిగతాచోట్ల జరుగుతున్న అక్రమనిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# మల్కారంలో ఎర్రమట్టి మాఫియా

-ప్రభుత్వ భూమిలో రాత్రిపూట యథేచ్ఛగా తవ్వకాలు
-పట్టించుకోని రెవెన్యూ అధికారులు



ప్రభుత్వ భూమిలో ఎర్రమట్టి తవ్విన దృశ్యం

**శంషాబాద్, మే 2, ప్రభాతవార్త:**
శంషాబాద్ మండలంలోని మల్కారం గ్రామంలో ఎర్రమట్టి మాఫియా ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గ్రామంలోని ప్రభుత్వభూమిలో ఉన్న ఎర్రమట్టిని రాత్రిపూట జెసిబిల సహాయంతో యథేచ్ఛగా తవ్వి లారీలను నింపి తరలిస్తున్నారు. జెసిబిలతో ఇష్టానుసారంగా తవ్వుతుండడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. ఈ విషయమై రెవెన్యూ అధికారులకు పోలీసులకు సమాచారం ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. విలువైన ప్రభుత్వభూమిలో ఉన్న ఎర్రమట్టిని రాత్రిపూట తవ్వి నగరంలో వేలాది రూపాయలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని గ్రామస్థులు తెలిపారు. ఎర్రమట్టిని తవ్వి ప్రభుత్వభూమిని పాడుచేస్తున్న వారిపై తగినచర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఎర్రమట్టి తవ్వకాలకు పాల్పడుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్‌చేశారు.

# రైతులు దళారుల బారిన పడొద్దు

-మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్
-మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి
-మూడు గ్రామాల్లో కొనుగోలుకేంద్రాల ప్రారంభం



కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభించిన మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి, తదితరులు

**శామీర్‌పేట, మే 2, ప్రభాతవార్త:**
రైతులు దళారుల బారిన పడవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలుకేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, శామీర్‌పేట సొసైటీపరిధిలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలుకేంద్రాల్లోనే రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించుకోవాలని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డిలు సూచించారు. శుక్రవారం మూడుచింతలపల్లి మండలంలోని శామీర్‌పేట సొసైటీ పరిధిలోని లక్ష్మాపూర్, కేశవరం, జగ్గంగూడ-సంపన్‌బోల్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలుకేంద్రాలను ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డిలు విచ్చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డిలు మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలుకేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించుకోవాలని, రైతుల శ్రేయస్సుకోసం ప్రభుత్వాలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో డిసిఎంఎస్ వైస్‌చైర్మన్, శామీర్‌పేట సొసైటీ చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి, మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, జిల్లా బిజెపి అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్, పలు గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

**శంషాబాద్ మే 2, ప్రభాతవార్త :**
శంషాబాద్‌మండలంలోని రామాంజపూర్ గ్రామపంచాయతీ అనుబంధగ్రామంగా ఉన్న బోటిగూడ ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పడిన సందర్భంగా నూతన పంచాయతీ కార్యాలయాన్ని ఏర్పాటుచేశారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ.. గ్రామస్థులు పట్టుబట్టి బోటిగూడను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేసుకున్నారని అన్నారు. అందరూ ఐక్యతతో ఉండి వచ్చే ఎన్నికల్లో పంచాయతీ పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని, చిన్న గ్రామాన్ని స్వచ్ఛగ్రామంగా తీర్చిద్దికోవాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా గ్రామ నాయకుడు కల్లె బిక్షపతి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌తోపాటు అధికారులను మండలపార్టీ నాయకులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిడివో మున్ని, మాజీ జడ్పిటిసి నీరటి తన్విరాజుముదిరాజ్, కాంగ్రెస్‌పార్టీ సీనియర్‌నాయకుడు కొడిగంటి చంద్రారెడ్డి, పాక్స్ చైర్మన్ రవిగౌడ్, మాజీసర్పంచ్ దండు ఇస్తారి, దేవరకొండ రమేష్‌యాదవ్, వైస్‌చైర్మన్ ప్రభసాగర్, అనగోని శ్రీకాంత్‌గౌడ్, మైలారం బిక్షపతి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

-సోలార్ ప్లాంటు వారిపైనే అనుమానం !

**పెద్దేముల్, మే 2, ప్రభతవార్త:**
అనుమానస్పదస్థితిలో ఓవ్యక్తి మృతిచెందిన సంఘటన పెద్దేముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, పెద్దేముల్‌మండలం గోపాల్‌పూర్‌గ్రామానికి చెందిన మాదారపు రాజశేఖర్‌రెడ్డి (37) గత ఏడు సంవత్సరాలుగా ఇందూరు విండ్‌స్టో సోలార్‌ప్లాంటులో సీనియర్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు, షిఫ్ట్ డ్యూటీ ఉన్నందున గురువారం సాయంత్రం 5గంటలకు సోలార్‌ప్లాంటుకు వెళ్లాడు. శుక్రవారం ఉదయం 7గంటల ప్రాంతంలో రాజశేఖర్‌రెడ్డికి ఆయన తండ్రి బాల్‌రెడ్డి ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. అదేగ్రామానికి చెందిన బట్టల జైపాల్ రెడ్డి తనవద్దకు వచ్చి రాజశేఖర్‌రెడ్డి ఉరివేసుకొని మృతిచెందాడని తెలిపారు. దీంతో కుటుంబపభ్యులు సంఘటన స్థలానికి వెళ్ళి చూడగా సోలార్ ప్లాంటులోని సిఎస్‌హెచ్‌పి ప్యానల్‌కు నైలాన్‌తాడుతో ఉరివేసుకొని మృతిచెందాడు. అయితే రాజశేఖర్‌రెడ్డికి ఎటువంటి ఆరోగ్య, ఆర్థిక, కుటుంబ సమస్యలులేవని, ఆయన ఉరివేసుకొనే పరిస్థితేలేదని, సోలార్‌ప్లాంటులో ఏదైనా జరిగి ఉండవచ్చని, లేదా మరే ఇతర కారణమైనా ఉండవచ్చని ఈచావుకు సోలార్‌ప్లాంటు వారిపైనే అనుమానం ఉందని బాల్‌రెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడి తండ్రి బాల్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు రాశేఖర్‌రెడ్డికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

## ఆడపిల్లలు విద్యాపరంగా అభివృద్ధి చెందాలి : ఎం.వి.ఫౌండేషన్



అడ్డగుట్టలో టాస్ సమావేశంలో ప్రసంగిస్తున్న ఎం.వి.ఫౌండేషన్ ప్రతినిధులు స్వామి,సువర్ణ తదితరులు

**అడ్డగుట్ట,మే 2 ప్రభాతవార్త:** ఆడపిల్లల సమస్యలు, లింగ సమనత్వం గురించి మాట్లాడడం, పద్ధతులు, ఆచరణ గురించి ఆలోచించకుండా ప్రతి ఒక్కరు విద్యాపరంగా అభివృద్ధి చెందాలని ఎం.వి.ఫౌండేషన్ జిల్లా కో-ఆర్డినేటర్ ఏ.వి.ఎం.స్వామి, హైదరాబాద్ జిల్లా టీమ్ మెంబర్ వి.సువర్ణలు పిలుపునిచ్చారు. తెలంగాణ ఆడపిల్లల సమనత్వ సమాఖ్య కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అడ్డగుట్టలోని ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లో నిర్వహించిన సదస్సుకు వారు ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు కాకుండా ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలు జరిగితే 1098,100లకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. వివిధ బస్తీలలో నివాసం ఉంటున్న పిల్లలు డ్రాప్ అవుట్ పిల్లలు బడికి మానేసి బాలకార్మికులుగా తయారు కాకుండా బాధ్యత తీసుకోవాలన్నారు. మురికివాడలలో చిన్న పిల్లలు డ్రగ్స్, గంజాయి, బాల్య వివాహాలు జరగకుండా చూడడంతో పాటు వారికి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.పి.ఎఫ్.మండల కన్వీనర్ ప్రవీణ్, టాస్ రాష్ట్ర కమిటీ మెంబర్ మైత్రి, జిల్లా కమిటీ సభ్యురాలు గీతా, మండల కమిటీ ప్రతినిధులు నేహా, పూజా, సమంత, వైష్ణవి, లాస్య, జయంతి, సువర్ణ, సుమలత, లావణ్య, రమాదేవిలు పాల్గొన్నారు.

## ఉగ్రదాడికి నిరసనగా ఆల్విన్ కాలనీ ముస్లిం సోదరుల ర్యాలీ




శాంతి ర్యాలీ పాల్గొన్న ముస్లి సోదరులు

**ఆల్విన్ కాలనీ, మే 2, ప్రభాతవార్త:**
కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడి చేసి 26 మందిని కాల్చి చంపడాన్ని నిరసిస్తూ శేర్లింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలో ముస్లిం సోదరులు శాంతి ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం నమాజ్ ( ప్రార్థన) అనంతరం, ఎల్లమ్మ బండ చౌరస్తాలోని మిసైల్ మెన్ ఏ పి జె అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేసి జాతీయ జెండాలను పట్టుకుని పాకిస్తాన్ మురుదాబాద్, పాకిస్తాన్ డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. హిందూస్తాన్ జిందాబాద్ అని హిందూ, ముస్లిం భాయ్ భాయ్ అంటూ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగ్రవాదులకు వ్యతిరేకంగా పోరాడుతామని మతంపై ద్వేషం నింపుకొని దాడులు చేయడం దారుణం అన్నారు. పాకిస్తాన్ చేయించినట్టి హేయ్మైన చర్యకు పాకిస్తాన్‌కి తగిన బుద్ధి చెప్పాలని దానికి ప్రభుత్వానికి మేము అండగా ఉంటామని తెలిపారు. దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను ఆదుకోవాలని ఈ దాడులకు బాధ్యులైన తీవ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని భవిష్యత్‌లో దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు, యువకులు, మత పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మెడికల్ ఇన్సూరెన్స్ డబ్బులు కంపెనీలకు చెల్లించాలి: ఐఎన్‌టియుసి



కొత్త కమీషనర్ ఆర్.వి.కర్ణన్‌ను కలిసిన మొక్కను అందచేస్తున్న దృశ్యం

**గన్‌ఫౌండ్రి,మే 2ప్రభాతవార్త:**
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్‌గా పదవి భాద్యతలు చేపట్టిన ఆర్.వి.కర్ణన్‌ను ఐ.ఎన్.టి.యు.సి అనుబంధ సంస్థ మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ విభాగం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందచేశారు.ఈసందర్బంగా జిహెచ్ఎంసి సహకార్ మజ్దూర్ యూనియన్‌కార్యానిర్వాహక అధ్యక్షులు అదిల్ షరీఫ్ మాట్లాడుతూ జిహెచ్ఎంసి విభాగంలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని విన్నవించినట్లు తెలిపారు.జిహెచ్ఎంసి విభాగంలో ప్రీమియర్ డబ్బులను ఇన్సురెన్స్ కంపెనీకి చెల్లించాలని కోరారు. రికార్డు అసిస్టెంట్,సానిటరీ జవాన్లు,జూనియర్ అసిస్టెంట్,సీనియర్ అసిస్టెంట్,ట్రాన్స్‌పోర్ట్‌విభాగంలో విధులు నిర్వహించే వారికి ఆరోగ్య పరిరక్షణ కొరకు ఇన్సురెన్స్ డబ్బులను చెల్లించాలని విన్నవించినట్లు తెలిపారు.కార్యక్రమంలో ఐ.ఎన్.టి.యు.సి విభాగం ప్రతినిధులు ఎవిఎస్ గాంధీ,ఎల్.మెర్సీ,సి.వై.యాదగిరి,కె.రాజు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి మోడీ తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం



ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న బిజెపి నాయకులు

**మైలార్‌దేవ్‌పల్లి, మే 2 ప్రభాతవార్త :**
దేశ రక్షణపై దృష్టి పెట్టిన కేంద్రం జనాభా లెక్కలతో పాటు కులగణనకు సంబంధించిన కులగణన చేపట్టాలని నిర్ణయించడం పట్ల దేశ ప్రజలు హర్షిస్తున్నారని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.కాటేదాన్ బిజెపి కార్యాలయంలో డివిజన్ బిజెపి అధ్యక్షులు అదిక రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ చిత్ర పటానికి పలువురు బిజెపి నాయకులు కలిసి పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కులగణన చేపడతామని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రకటించడం చారిత్రాత్మకమైన నిర్ణయమని తెలిపారు.కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి కన్వీనర్‌మల్లేష్ యాదవ్,బిజెపి నాయకులు రావుల భాస్కర్, ఎన్.జగన్,పాండు యాదవ్,నర్సి రెడ్డి,ఎలివి రెడ్డి,మధుసూదన్ రెడ్డి, డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉదుత లక్ష్మి,అంజమ్మ, నందిని,శివ,జి.శంకర్,రామారావు,శేఖర్,రవి,అంజి సురేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# జిహెచ్ఎంసిలో అవినీతి చైన్‌మెన్లపై చర్యలు తీసుకోవాలి

## -మేయర్ గద్వాలకు ముప్పిడి ఫిర్యాదు



జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మిని కల్సి వినతి పత్రం అందిస్తున్న దళిత చైతన్య సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పిడి నవీన్‌కుమార్‌మాదిగ.

**బేగంపేట మే 2,ప్రభాతవార్త**
నగరంలోని వివిధ జీహెచ్ఎంసీ కార్యాలయాల్లో పదుల సంవత్సరాలుగా ఒకే చోట విధులు నిర్వహిస్తూ జీహెచ్ఎంసీ ఆదాయానికి భారీగా గండి కొడుతూ అక్రమంగా కోట్లు గడిస్తున్న జీహెచ్ఎంసీ చైన్ మెన్లు (మున్షీ)లపై పూర్తి స్థాయి విచారణ జరిపి వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతూ దళిత చైతన్య సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పిడి నవీన్‌కుమార్ మాదిగ జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మిని కల్సి లికిత పూర్వకంగా పిర్యాదు చేసారు.ముఖ్యంగా సికింద్రాబాద్ జోన్ పరిధిలోని బేగంపేట ,సికింద్రాబాద్ సర్కిళ్లలో విధులు నిర్వహిస్తున్న చైన్‌మెన్లు 15నుంచి 20సంవత్సరాలుగా ఒకే చోట విధులు నిర్వహిస్తూ అక్రమాలను ప్రోత్సహిస్తూ వారి జేబులు నింపుకుంటున్నారని మేయర్ దృష్టికి తీసికెళ్లారు.గతంలో అనేక సార్లు బేగంపేట,సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై లిఖిత పూర్వక ఫిర్యాదు చేసినా చైన్ మెన్లు మాత్రం అక్రమార్కులకు సహకరిస్తూ నిబంధనలకు తూట్లు కొడుతున్నారని వివరించారు.సికింద్రాబాద్‌లో అక్కడక్కడా ఫిర్యాదులపై అధికారులు స్పందించి కూల్చి వేసినా బేగంపేట సర్కిల్ లో మాత్రం ఫిర్యాదు చేసిన అక్రమ నిర్మాణాలపై ఎలాంటి స్పందన లేదన్నారు. బేగంపేట సర్కిల్ ఏసీపీ అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపు కుంటున్నారని మేయర్ దృష్టికి తీసికెళ్లారు.ఏళ్ల తరబడి జీహెచ్ఎంసీ లలో పాతుకు పోయిన చైన్‌మెన్లను వెంటనే మార్చివేయాలని,నవీన్‌కోరారు.స్పందించిన మేయర్ ఈ విషయంపై త్వరలోనే నిర్ణయం తీసుకుని ఏళ్ల తరబడి ఒకే చోట విధులు నిర్వర్తిస్తున్న చైన్‌మెన్ల(మున్షీ)లను బదిలీ చేయనున్నట్లు మేయర్ తెలిపినట్లు ముప్పిడి నవీన్‌కుమార్ తెలియజేసారు.

## సమస్యలు పరిష్కరించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న శ్రీనివాసనగర్ కాలనీ వాసుల దృశ్యం

**నార్సింగి, మే 2 ప్రభాతవార్త :**
బండ్లగూడ జాగీర్ కార్పోరేసన్ గంధంగూడ శ్రీనివాస నగర్ కాలనీలో సమస్యలు పరిష్కరించి, మౌళిక వసతులు కల్పించిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు కాలనీ ప్రతినిధుల బృందం కృతజ్ఞతలు తెలిపారు. శ్రీనివాస నగర్ కాలనీ అధ్యక్షులు నాగేష్ ప్రతినిధులు యాదయ్య, అవినాష్, వేణుగోపాల్ మురళీ, నాగిరెడ్డి, మహేష్, విజయ తదితరులు శుక్రవారం ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి షాలువాతో సన్మానించి తమ కాలనీ అభివృద్ధికి తోడ్పాటు అందించినందుకు ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నాగేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మా కాలనీలో చాలా ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న వారట్ పైప్‌లైన్ పనులు పూర్తి చేయించారని తెలిపారు. అలాగే రోడ్లు, వీధి దీపాలను కూడా మరమ్మత్తులు చేయించాలని కోరామన్నారు. వేసవి కావడం వలన ఇళ్లల్లోని బోర్లు ఎండిపోయి ప్రజలు అల్లాడుతున్నారని, ఈ రెండు నెలల పాటు మూడు రోజులకు ఒకసారి మంచినీటిని సరఫరా చేయించాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు. మా సమస్యలన్నింటిని విన్న ఎమ్మెల్యే వెంటనే బండ్లగూడ కార్పోరేషన్ కమీషనర్‌కు ఫోన్ చేసి శ్రీనివాస నగర్ కాలనీ సమస్యలు పరిష్కరించానలి ఆదేశించారని ఆనందను వ్యక్తం చేశారు. ఇన్నాళ్లు మా కాలనీ సమస్యల పరిష్కారం కోసం సహకరించిన మాజీ కార్పోరేటర్లు తలారి చంద్రశేఖర్, సాగర్‌గౌడ్, శ్రీనాథ్‌రెడ్డి, ఆల్ కాలనీస్ ఫెడ్రేషన్ అధ్యక్షులు వినయ్‌రెడ్డిలకు ప్రత్యేక ధన్యావాదాలు తెలుపుతున్నామని నాగేష్ పేర్కొన్నారు.

## పేదలకు చేయూత సిఎం సహాయనిధి : ఎమ్మెల్యే



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

**కెపిహెచ్బి కాలనీ, మే 2, ప్రభాతవార్త:**
పేదలకు చేయూత ఇస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి అని ఎమ్మెల్యే కృష్ణారావు అన్నారు. శుక్రవారం కూకట్పల్లి, బాలానగర్ మండలానికి సంబంధించి కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పంపిణీ చేశారు. ఇందులో బాలనగర్ మండలానికి సంబంధించి 145 మంది లబ్ధిదారులకు, కూకట్పల్లి మండలానికి సంబంధించి 80 మంది లబ్ధిదారులకు మొత్తం 225 మందికి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుపేద ఆడబిడ్డ పెళ్లయితే వారి ఇబ్బందులు తెలుసుకొని వారికి అండగా ఉండాలన్న ఉద్దేశంతో మొదట యాభై ఒక్క వేలను ఇచ్చేవారని తర్వాత 71 వేలుగా చేసి మళ్లీ ఆయన ఒక లక్షా నూట పదహారు రూపాయలు దేశంలో ఎక్కడా లేనివిధంగా అందించడం జరిగిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తులం బంగారం ఇస్తామన్నారని ఇప్పటికీ అది నోచుకోలేదని లేనిపోని హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం పబ్బం గడుపుతోందని అన్నారు. ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ముద్దం నరసింహ యాదవ్, పండాల సతీష్ గౌడ్, ఆవుల రవీందర్ రెడ్డి, మందడి శ్రీనివాసరావు, పగుడాల శిరీష బాబురావు, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ గౌసుద్దీన్, ఎంఆర్‌ఓలు శ్రీనివాస్, స్వామి, పాల్గొన్నారు.

## దేశంలో కులగణన చేపట్టాలన్న నిర్ణయం చారిత్రాత్మకం : ఠాకూర్ అమర్ సింగ్



గుడిమల్కాపూర్ లో ప్రధాని మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బిజెపి నేతలు

**మెహదీపట్నం, మే 2, ప్రభాతవార్త :**
దేశంలో జనగణనతో పాటు కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం చారిత్రాత్మకమని బిజెపి కార్వాన్ నియోజకవర్గ ఇన్ ఛార్జ్ ఠాకూర్ అమర్ సింగ్ అన్నారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రజాభిప్రాయానికి అనుగుణంగా నడుచుకుంటుందని, దీనికి కుల గణన చేపట్టడమే నిదర్శనమన్నారు. బిజెపి ఓబీసీ మోర్చా గోల్కొండ జిల్లా అధ్యక్షులు చెరుకుల ఉదయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి కట్ట నర్సింగ్ రావు ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి శిరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఠాకూర్ అమర్ సింగ్ పాల్గొని మాట్లాడుతూ... బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. దేశంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రజాభిప్రాయ నిర్ణయానికి అనుగుణంగా పనిచేస్తుందని తెలిపారు. ప్రజలు ఏది కోరుకుంటే అది చేయడమే ప్రభుత్వాల పని అని, దేశంలో జనగణన తో పాటు కులగనన చేయడం చారిత్రాత్మకమన్నారు. ఇలాంటి చారిత్రాత్మకమైన నిర్ణయాలు కేంద్ర ప్రభుత్వం తీసుకుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు శివ రత్నం, దేవర శ్రీనివాస్, ఉమారాణి , గోవర్ధన్, డిజ్వర్ సింగ్, అనిల్ చారి, దేవర వంశీ, శివ, సుధాకర్ యాదవ్, కట్ల అశోక్ , గంజి రఘునాథ్, నామ యాదగిరి నేత, భాను ప్రకాష్ ప్రభు పూజారి, మధుసూదన్, లక్ష్మి కాంత్, శ్రీను, జగదీష్, రాజు, వెంకటేశం పాల్గొన్నారు.

## 4న పబ్లిక్‌గార్డెన్స్‌లో "గౌ మహా హారతి "

### -విశ్వహిందూ మహాసంఘ్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైభవ్ సూర్య, మఖేష్‌నాథ్, లక్ష్మీ, సిడిచౌహాన్, జస్మత్ పటేల్ తదితరులు

**హైదరాబాద్,ఏప్రిల్ 2,ప్రభాతవార్త:**
విశ్వహిందూ మహాసంఘ్ ఆధ్వర్యంలో ఈనెల 4న ఆదివారం నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని లలిత కళా తోరణంలో "గౌ మహా హారతి "పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విశ్వ హిందు మహా సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు వైభవ్ సూర్య, జాతీయ కన్వీనర్ మహంత్ ముఖేష్ నాథ్‌జీ, జాతీయ కో ఆర్డినేటర్ లక్ష్మీ,గ్లోబల్ హిందూ ఫెడరేషన్ సిడీ చౌహాన్, లఫ్ ఫర్ కౌ జస్మత్ పటేల్ తదితరులు హాజరై కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం జరిగే కార్యక్రమంలో మొదటగా 1కిమీ గౌవాక్ , ఆతర్వాత గౌమాత క్షేమం, రక్షణ కోసం పవిత్ర యజ్ఞం మూడుగంటల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే వివిధ సాంప్రదాయ ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం అంతిమంగా హారతి కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. దీనికి అన్ని హిందూ సంఘాలు, భక్తులు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈకార్య క్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. సమత, వెంకట్ పాల్గొన్నారు.

# రేపు రవీంద్రభారతిలో "భరీరథ మహర్షి జయంతి ఉత్సవం "



కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, శేఖర్‌సగర, మారుతీ సాగర్ తదితరులు

**హైదరాబాద్,మే 2,ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 4న (ఆదివారం) రవీంధ్ర భారతిలో సగర భరీరథ మహర్షి జయంతి ఉత్సవం నిర్వహించున్నట్లు తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర తెలిపారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బాలగౌని బాలరాజుగౌడ్, సగర సంఘం ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం, మారుతి సాగర్‌లతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ రవీంధ్రభారతిలో నిర్వహించే ఈకార్యక్రమానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావులతోపాటు రాష్ట్రంలోని బిసి సంఘాల నాయకులు హాజరవుతారన్నారు. దీనికి తెలంగాణలోని సగరులంతా పెద్దఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఆత్మగౌరవ ట్రస్ట్ చైర్మన్ మారుతీసాగర్, ఉపాధ్యక్షులు ఆంజనేయులు సగర, కెపి, రాములు, మహిళా నేతలు పల్లవి సగర, సరిత సగర, జయమ్మ సగర, యువజన సంఘం నేతలు సురేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సిఎం రేవంత్‌రెడ్డిని సన్మానించిన గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటి



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటి నేతలు బాలగౌని బాలరాజుగౌడ్, అయిలి వెంకన్నగౌడ్ తదితరులు

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు, కులగణన ప్రక్రియ అసెంబ్లీలో తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపి పార్లమెంట్లో చట్టం చేయాలని చిత్తశుద్ధితో కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీలకు తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటి చైర్మన్ బాలగౌని బాలరాజు గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, వర్కింగ్ చైర్మన్ యేలికట్టే విజయకుమార్ గౌడ్, బీసీ సమైక్య అధ్యక్షులు దుర్గయ్యగౌడ్, సింగం నగేష్ గౌడ్‌లు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్బంగా సిఎంకు వారు పూల బోకేతో సన్మానించారు. బీసీ కులగణన చేసేందుకు రేవంత్‌రెడ్డి చేసిన కృషి హర్షనీయం అని వారు తెలిపారు. అనంతరం చిక్కడపల్లిలో సమన్వయ కమిటి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. దశాబ్దాల పోరాట ఫలితమే నేడు కేంద్ర ప్రభుత్వం జనగణంలో భాగంగా కులగణన ప్రక్రియ చేస్తానని ప్రధానిమోడీ, కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నారని అందుకు కేంద్ర ప్రభుత్వానికి కూడా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు వారు తెలిపారు. రాష్ట్రంలో జరిగిన పోరాటాల వలనే కులాల లెక్కలు తీయడం జరిగిందన్నారు. మేమెంతో మాకంత వాటాని అన్ని రంగాల లో కోటా పొందినప్పుడే నిజమైన సామాజిక న్యాయం దక్కుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కులాల వారీగా లెక్కలను ఆరు మాసాలలోపు తీసి 50 శాతం రిజర్వేషన్ ఎత్తివేసి పారదర్శకంగా విద్య, ఉద్యోగ సామాజిక రంగంలో వాటా కల్పిస్తూ ముందడుగు వేయాలని కోరారు.

# పోస్టుల భర్తీలో ఇండస్ట్రీ సర్వీస్‌కు వెయిటేజీ మార్కులు ఇవ్వాలని వినతి



వినతిపత్రాన్ని అందజేస్తున్న

**తార్నాక, మే 2 ప్రభాతవార్త :** విశ్వవిద్యాలయాల్లో చేపట్టే అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీలో ఇండస్ట్రీ సర్వీస్ కు వేయిటేజీ మార్కులు కేటాయించాలని తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఇండస్ట్రీస్ ప్రొఫెషనల్ డాక్టరేట్స్ (టీజీఏఐపీడీ) కోరింది. ఈ మేరకు టీజీఏఐపీడీ అధ్యక్షుడు డాక్టర్ రామస్వామి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బొల్లం తిరుపతిలు తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డి, రిక్రూట్మెంట్ గైడ్ లైన్స్ కమిటీ సభ్యులు, అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణిలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 21లో ఇండస్ట్రీస్ ప్రొఫెషనల్స్‌కి వేయిటేజీ ఇవ్వలేదని ఛైర్మన్ దృష్టి కి తీసుకెళ్ళారు. జీవోలో ఇండస్ట్రీ సర్వీస్ కు చోటు కల్పించక పోవడం విస్మయానికి గురి చేస్తోందని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి కల్పన కోర్సులకు, డిగ్రీలకు ప్రాధాన్యత ఇస్తున్న ఈ సందర్భంలో విద్యార్థులను డిగ్రీలతో పాటు.. వారి వారి కోర్సులు పూర్తి అవ్వగానే ఉద్యోగ అవకాశాలు దొరికే విధంగా తీర్చి దిద్దాలని ప్రభుత్వాలు నిర్ణయించాయని గుర్తు చేశారు. ఇందు కోసం పరిశ్రమలలో, ఇండస్ట్రీస్ లలో పని చేస్తున్న వారి చేత విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా కూడా విద్య సంస్థలు ఇదే విధానాన్ని అనుసరిస్తున్నాయని.. రిక్రూట్ మెంట్స్ లో కూడా పరిశ్రమలో పని చేసిన అనుభవాన్ని కూడా ఒక అర్హతగా పరిగణలోకి తీసుకుంటున్నాయన్నారు. యూనివర్సిటీలోని చాలా డిపార్ట్ మెంట్లలో కూడా ఆయా ఇండస్ట్రీస్ లో అనుభవాలు విద్యార్థులకు అవసరమవుతాయన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని యూజీసీ కూడా ప్రాక్టీస్ ఆఫ్ ప్రొఫెసర్ పేరుతో ఫ్యాకల్టీని నియమించుకోవచ్చని ఉత్తర్వులు జారీచేసిందని గుర్తు చేశారు. ఇప్పటికే పలు యూనివర్సిటీలో ప్రాక్టీస్ ఆఫ్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేస్తున్నాయని, ఉస్మానియా యూనివర్సిటీలో కూడా కొన్ని డిపార్ట్ మెంట్లలో తీసుకున్నారని చెప్పారు.ఇలాంటి సందర్భంలో ప్రభుత్వం చేపట్టబోయే ప్రొఫెసర్ పోస్టుల భర్తీలో ఇండస్ట్రీస్ సర్వీస్ కు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు . పరిశోధన రంగంలో అనుభవం ఉన్న వారితో పాటు, ఇండస్ట్రీస్ లో పని చేసిన వారు టీచింగ్ లోకి వస్తే మంచి ఫలితాలు వస్తాయని పలు చోట్ల రుజువు కూడా అయిందన్నారు . ఈ విషయాలను పరిగణలోకి తీసుకొని జీవో నెంబర్ 21లో సవరణ చేయాలని విజ్ఞప్తి చేశారు.

# బిసిలకు విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో రిజర్వేషన్లకు చట్టబద్దత కల్పించాలి

## -బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ



ఎర్ర సత్యనారాయణ వేసిన పిటిషన్ జడ్జిమెంట్ ప్రతులను ప్రదర్శిస్తున్న గుజ్జ కృష్ణ, ఎర్ర సత్యనారాయణ తదితరులు

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త:**
జాతీయ జనగణనలో కులగణనతో పాటు బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో 52 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించినప్పుడే బీసీల ఆకాంక్ష నెరవేరుతుందని బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అన్నారు. శుక్రవారం కాచిగూడలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హైకోర్టులో, సుప్రీం కోర్టులో ఫిటిషన్ వేయడం జరిగిందని తెలిపారు. హైకోర్టు తీర్పు మేరకే తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే కులగణన చేపట్టిందని ఆయన గుర్తు చేశారు. ఢిల్లీలో జంతర్మంతర్ వద్ద ప్రదర్శనలు, సభలు, సమావేశాలు, ప్రధానమంత్రులను, కేంద్రమంత్రులను కలిసి చర్చలు జరపడం. బీసీ సంఘాల సమిష్టి కృషి, సుదీర్ఘ పోరాట ఫలితమే దేశ జనాభా గణనలో కుగణనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసకున్న నిర్ణయాన్ని స్వాగతీస్తున్నామని ఆయన పేర్కొన్నారు. పార్లమెంట్ లో బీసీ బిల్లు పెట్టి చట్టసభలలో బీసీలకు 52శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 50శాతం ఇవ్వాలని కోరారు. బీసీలకు బడ్జెట్లో 2లక్షల కోట్లు కేటాయించాలని అన్నారు. దేశ వ్యాప్తంగా ఫీజు రియంబర్స్‌మెంట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కులగణన ద్వారానే సామాజిక న్యాయం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు కోలా జనార్ధన్, సుధాకర్, వేముల రామకృష్ణ, నందగోపాల్, వంశీ, ఉదయ్,రూప, హరిచరణ్, వినోద్, హరితిలక్‌సింగ్ తదితర బిసి నేతలు పాల్గొన్నారు.

# ఎన్ఐఆర్‌డిపిర్ ఉద్యోగులు,పెన్షనర్లు నిరసన

## -జీతం,పెన్షన్ విడుదల చేయాలని డిమాండ్




**అత్తాపూర్ మే2,ప్రభాతవార్త :**
హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ (ఎన్ఐఆర్‌డిపిర్)కి చెందిన 300 మందికి పైగా ఉద్యోగులు , పెన్షనర్లు శుక్రవారం ఏప్రిల్ నెల జీతం మరియు పెన్షన్ విడుదల చేయనందుకు నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ....సాధారణంగా, జీతం మరియు పెన్షన్ చెల్లింపు ప్రతి నెలా చివరి పని దినాన విడుదల చేయబడుతుందని ఏప్రిల్ 2025 నుండి భారత ప్రభుత్వం ఎన్ఐఆర్‌డిపిర్‌లో గ్రాంట్ కోతను ఎదుర్కొంటుందని పేర్కొన్నారు. గత సంవత్సరం నుండి సంస్థకు తగినంత పొదుపులు మరియు సంవత్సరాలుగా సృష్టించబడిన కార్పస్ ఫండ్ నుండి వడ్డీ ఆదాయం ఉన్నప్పటికీ, ఖర్చులను తీర్చడానికి ఉపయోగించవచ్చని డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి. నరేంద్ర కుమార్ ఉద్దేశపూర్వకంగా జీతం మరియు పెన్షన్ విడుదలను ఆలస్యం చేస్తున్నారని వాపోయారు. ముందస్తు సమాచారం లేకుండా జీతాలు మరియు పెన్షన్‌లను సకాలంలో విడుదల చేయడంలో జాప్యం చేయడంతో తీవ్ర భయాందోళన గురువుతున్నామని పాఠశాల ఫీజులు, ఆసుపత్రి ఛార్జీలు, బ్యాంకు రుణ సకాలంలో చెల్లించలేక ఇబ్బంది పడుతున్నామరు దాదాపు 220 మంది శాశ్వత ఉద్యోగులు మరియు 450 మంది కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారు. డైరెక్టర్ జనరల్ మరియు సీనియర్ మేనేజ్‌మెంట్ ఎన్ఐఆర్‌డిపిఆర్‌తో చాలా కాలంగా పనిచేస్తున్న అనేక మంది కాంట్రాక్టు సిబ్బందిని తొలగించాలని ప్రణాళిక వేసిందని అన్నారు. ఖర్చు తగ్గించే చర్యలలో భాగంగా యాజమాన్యం ఇప్పటికే మూడింట రెండు వంతుల భద్రతా సిబ్బందిని తొలగించింది. 170 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న విశాలమైన క్యాంపస్‌ను కాపాడటానికి ప్రస్తుతం షిఫ్ట్‌కు 5 నుండి 6 మంది భద్రతా సిబ్బంది మాత్రమే విధుల్లో ఉన్నారని ఇది క్యాంపస్ యొక్క మొత్తం భద్రతను పెద్ద ప్రమాదంలో పడేస్తుందని అన్నారు.సంస్థను అస్తవ్యస్తమైన పరిస్థితికి మరియు అనిశ్చితికి తీసుకువచ్చిన డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి. నరేంద్ర కుమార్‌ను వెంటనే తొలగించి భర్తీ చేయాలని ఉద్యోగులు మరియు పెన్షనర్లు డిమాండ్ చేశారు.

## సిఎం చిత్రపటానికి పాలాభిషేకం



**చార్మినార్,మే 2 ప్రభాతవార్త :** దేశంలో నిర్వహించే జనాభా లెక్కలలో భాగంగా కులగణన కూడ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించి నందుకు శుక్రవారంచాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి బోయ నరేష్‌తో పాటు నియోజకవర్గానికి చెందిన పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు కలిసి చాంద్రాయణగుట్ట వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ దేశంలో శాస్త్రీయ పద్దతిలోఎటువంటి సమస్యలు లేకుండ కులగణన పూర్తి చేసిన ఘనత తెలంగాణ రాష్ట్రానికే దక్కుతుందని తెలిపారు.తెలంగాణలో నిర్వహించిన కులగణన దేశానికి ఆదర్శమని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ ఇంఛార్జి బోయ నరేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వెంకటేష్ ముదిరాజ్,శ్యాంరావు ముదిరాజ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## నరేంద్రమోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం



**అత్తాపూర్ మే 2,ప్రభాతవార్త :** జనగణనలో కులగణన చేయడం చారిత్రత్మాక నిర్ణయమని పలువురు బిజెపి నేతలు సంతోషం వ్యక్తం చేశారు. జనగణనతో పాటు కులగణనను కేంద్ర క్యాబినెట్ ఆమోదించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దన్యవాదాలు తెలుపుతూ డివిజన్ అధ్యక్షులు సుల్గే వెంకటేష్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ప్రతాప్ రెడ్డి , పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి ,జిల్లా సెక్రెటరీ కొమురయ్య, రాచూరి రాజశేఖర్, జయానంద్ రెడ్డి ,కిరణ్ విజయ్ కుమార్, నల్లింగ్ రమేష్, జి రాజు ,శ్రీనివాస్ రెడ్డి, ఆర్ జగన్ ,పి వెంకట్ రెడ్డి, శశికాంత్ శర్మ ,అనురాధ ,ఉమా స్వప్న ,శ్రీకాంత్ చారి, విశాల్ ,బాలకృష్ణ ,ముకేష్,రాము, విజయ స్వామి ,భరత్ ,శివ, రాంబాబు ,తదితరులు పాల్గొన్నారు.


## మధులిక తేజ తండ్రికి అభినందనలు



దాకన్న ప్రభాకర్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, మే 2 :** షాద్‌నగర్ పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ దాకన్న సుధాకర్ తమ్ముడు,ప్రముఖవ్యాపారవేత్త, షాద్‌నగర్ మాజీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ దాకన్న ప్రభాకర్ రెండవ కూతురు మధులిక తేజ జూనియర్ సివిల్ జడ్జిగా మొదటి సారి పరీక్షల్లో ఉత్తీర్ణులై తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు, సమాజంలో గుర్తింపు, గౌరవం తెచ్చినందుకుదాకన్న ప్రభాకర్‌ను షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీఖాన్, కాంగ్రెస్ నాయకులు అగ్గనూరు బస్వం, ఎండీ ఇబ్రహీంలు కలుసుకొని శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో సన్మానించారు.

## కళాశాల నిర్మాణానికి రూ.11 లక్షల భారీ విరాళం



ఎమ్మెల్యే శంకర్‌కు విరాళాన్ని అందజేస్తున్న దాతలు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, మే2 :** చేసే దానాలు చరిత్రలో చిరకాలం నిలిచిపోయేలాఉండాలని, అవిపదిమందికి పదితరాలపాటు ఉపయోగపడాలనిషాద్‌నగర్ ఎమ్మెల్యేవీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ పట్టణంలో దాతల సహకారంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి రవి ఫ్రూట్స్ అధినేత రవికుమార్ అగర్వాల్, కేధార్‌నాథ్ అగర్వాల్, రాజేందర్‌కుమార్ అగర్వాల్‌లు రూ.11 లక్షలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం రూ.11 లక్షలకు సంబంధించిన చెక్కును స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చరిత్రలో చనీవినీ ఎరుగని విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలను నిర్మించి ఈ ప్రాంతం రుణం తీర్చుకోవాలని చేస్తున్న కృషికి దాతలు విద్యా సాయం కోసం ముందుకు గర్వించదగ్గ విషయమని కొనియాడారు. మనం పోయినా మనంచేసిన పనులు చిరకాలం గుర్తుండిపోయేలా ఉండాల న్నారు. ప్రపంచంలో సామాజిక సేవ, తత్పరతకు మించిన సంతృప్తి మరొకటి ఉండదని, డబ్బులు అందరు సంపాదిస్తారని, అయితే వాటిని ప్రజా ప్రయోజనార్థం ఖర్చు చేయడమనేదిగొప్పవిషయమని, అందుకు గొప్ప మనుస్సు ఉండాలన్నారు. అనంతరందాతలు మాట్లాడుతూ ఎమ్మెల్యే శంకర్ ఆధ్వర్యంలో చేపట్టినఈగొప్పపనికి తమవంతు సహకారం అందించామని,ఒకగొప్పపనికిసాయంచేయడంఎంతోసంతృప్తిని ఇచ్చిందని అన్నారు. ఎమ్మెల్యేశంకర్ కృషిని వారు ప్రత్యేకంగా అభి నందించారు. భవిష్యత్తులో ఎమ్మెల్యే మరిన్ని ఉన్నతశిఖరాలు అది రోహించాలని, పదిమందికి ఉపయోగపడేలా మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని వారు ఆకాంక్షించారు.

## ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం




విద్యార్థులను సన్మానించిన ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

**కొడంగల్‌రూరల్, మే 2 ప్రభాతవార్త :** విద్యార్థులు బాగా చదువుతూ ఉన్నత స్థానాలను అధిరోహించాలని ప్రిన్సిపాల్ డివి.నరేశ్‌రాజ్ అన్నారు. స్థానిక నవీన ఆదర్శ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మహీన్, సాయిశ్రీ, వైష్ణవి, బిందు, బిలాల్, అక్షిత, శరత్, శివశంకర్, శ్రీహరి, శివప్రసాద్, జస్వంత్‌లు పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ మార్కుల సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులను శాలువాలతో సన్మానించి మెమోంటోలు అందించారు. గత38సంవత్సరాల అనుభవంతో ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దామని ఆయన తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయ సాధన కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు డి.వెంకటయ్య, వైస్ ప్రిన్సిపాల్ సంతోష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్ ఏర్పాటునుఉపసంహరించుకోవాలి

**గుమ్మడిదల, మే 2 ప్రభాతవార్త :** మండలంలో ప్యారానగర్ డంపింగ్ యార్డు(ఎంఎస్‌డబ్ల్యూ)ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్‌చేస్తూ చేపట్టిన రిలేనిరాహారదీక్ష 87వ రోజుకు చేరుకున్నది. మండలంలోని నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్ సమీపంలో ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డును ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఇందులో రైతు జేఏసీ నాయకులు, మహిళా నాయకులు పాల్గొని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలుచేశారు. 87 రోజుల నుంచి రిలే నిరాహారదీక్ష చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం స్పందించక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్‌పై స్పం దించే వరకు దీక్ష కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. జేఏసీ నేతలు పాల్గొన్నారు.

## కబ్జాదారులను కఠినంగా శిక్షించాలి

**పుల్‌కల్, మే 2, ప్రభాతవార్త:** 50 ఏళ్లుగా కాస్తులో ఉన్న భూమిని, జీవ నోపాధి కోసం ఏర్పాటు చేసుక్ను దుకాణ సముదాయాన్ని సమాచారంఇవ్వకుండానే తొలగించిన అధికారులపై, కొడవటి శంకరయ్య, పెంటయ్య లపై చట్టరీత్య కఠిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని మన్నె మొగు లయ్య శుక్రవారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అంద చేశారు.. దుకాణం తొలగించినందుకు పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేసిన ప్రయజనం లేకుండాపోయిందని విచారం వ్యక్తం చేశారు.దుకాణం తొలగించడంతో తనకు 5లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లిందని కన్నీరు పెట్టుకున్నాడు. దళితుడైన తనకు అన్యాయం చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని, బాధ్యులపై ఎసీ,ఎస్టీ అట్రాసిటి కేసును నమోదు చేయాలని మన్నె మొగులయ్య డిమాండ్ చేశారు.

## బోరంచలో ఘనంగా విగ్రహాల ప్రతిష్టాపన

**మనూర్,మే 2, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బోరంచ గ్రామంలో ఉరుడమ్మ,పాపమ్మవిగ్రహాల ప్రతిష్టాపన భక్తి శ్రద్దలతో శోభాయమానంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలు బీచ్కుంద ఆశ్రమ పీఠాధిపతి సోమయ్య అప్ప మహారాజ్ నేతృత్వంలో బీచ్కుంద ఆశ్రమ వేదిక పురోహితులచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి విగ్రహాల ప్రతిష్టాపన నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న సోమయ్య అప్ప మహారాజ్‌ను అందంగా అలంకరించిన అశ్వంపై ఆలయం వరకు ఊరేగింపుగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భోజిరెడ్డి, బోరంచ నల్లపోచమ్మ ఆలయ కమిటి చైర్మన్ బెల్లాపురం మల్లయ్యతో పాటు బోరంచ, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ చిత్ర పటానికి క్షీరాభిషేకం

**యాచారం,మే2,ప్రభాతవార్త:**బిజెపిప్రభుత్వంనరేంద్ర మోడీ నాయకత్వంలో కుల గణన పై కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని హర్షించదగ్గ విషయమని మాజీ సర్పంచ్ విజయకుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామంలో భారతీయ జనతా పార్టీ బూత్ అధ్యక్షులు ఆధ్వర్యంలో నరేంద్రమోడీచిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో నంది వనపర్తి మాజీ సర్పంచ్ రాయ కంటి విజయ్ కుమార్ మాట్లాడుతూ.. 2010 లోనే బిజెపి తన వైఖరిని నాడు లోక్ సభ లోక్ సభ ప్రతిపక్ష నేత సుష్మా స్వరాజ్ అనుకూలంగా ఉన్నామని అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీకి లేఖ రాయడం జరిగిందన్నారు.
కాంగ్రెస్ పార్టీ కులగణను పక్కనపెట్టి 2011లో కేవలం జన గణన మాత్రమే చేయడం జరిగిందని స్వాతంత్రం అనంతరం అత్యధిక కాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ 2014 వరకు కుల గణన ఎందుకు చేయలేక పోయిందని ప్రశ్నించారు.
కాంగ్రెస్ పార్టీకి ఓట్ల రాజకీయం, అధికారం తప్ప దేశం మీద తరతరాలు ఎలాంటి ప్రేమ ఉండదని ఆయన అన్నారు.
ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బిసిలకు అనుకూలంగా తీసుకున్న కులగన నిర్ణయాన్ని బిసి కులాలుబీసీసంఘాలు హర్షిస్తున్నాయి అని ఆయన అన్నారు బిజెపిసీనియర్‌నాయకులు గోగికార్ రమేష్,సామ సంతోష్, వంగూరు



నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బిజెపి నాయకులు

సాయి, బూత్ అధ్యక్షులు పంబాల శివాజీ, పంతం మధుకర్,యాదవ్, జనిగే శివ యాదవ్,కొండాపురం రాజ్‌కుమార్, కొండాపురంశ్రీనివాస్, మూలి వెంకటయ్య ,బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూభారతి అవగాహన సదస్సుపై ప్రజల అసంతృప్తి

### యువజన కాంగ్రెస్ నేత పడమటి నిఖిల్‌రెడ్డి

**గుమ్మడిదల, మే 2(ప్రభాతవార్త) :** మండల కేంద్రంలో గురువారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో చేపట్టిన భూభారతి అవగాహన సదస్సు పై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు పడమటి నిఖిల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సభలో కొద్దిసేపైనా ఉండకుండా వెంటనే వేదిక దిగి వెళ్లిపోయారని అన్నారు. భూ భారతి పై ప్రజలకు ఉన్న సందేహాలు, సూచనలను తెలిపే అవకాశం ఇవ్వలేదని అసంతృప్తి వ్యక్తం చేశారని ఆయన తెలిపారు. రెండు గంటలు వేచి చూసిన ప్రజలకి కనీసం రెండు నిమిషాలు మాట్లాడే అవకా శం ఇవ్వకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదివరకు ధరణి పోర్టల్‌లో ఉన్న అవకతవకలు సరిచేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతిలో కొన్ని మార్పు చేర్పులకు చేపట్టాలని కోరారు. వాటితోపాటు విద్యార్థులు విదేశీ విద్యాభ్యాసం కోసం రుణం పొందడంలోనూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మం డల అధికారులు మరొకసారి రైతులతో సదస్సు కార్యక్రమం నిర్వహించి రైతులకు, ప్రజలకు ఉన్న సందేశాలు తీర్చాలని కోరారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

**చౌటకూరు, మే 2, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర్ ఆదేశాల మేరకు సిఎఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణి కార్యక్రమాన్ని నిర్వహించి బాధ్యుతలకు చెక్కులను అందచేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రామాగౌడ్, మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎండి కైసర్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుఉ వర్కల రమేష్, ప్రధాన కార్యదర్శి ఆగమయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తార్దన్‌పల్లి రవీందర్, మైనార్టీ సెల్ అధ్యక్షులు షరీఫ్, నాయకులు పంతులు శ్రీనివాస్, నవీన్‌గౌడ్, కొలుకూరి రవి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జహీరాబాద్ మండలంలో 16 మందికి...

**జహీరాబాద్, మే 2, ప్రభాతవార్త:** అనారోగ్యాలకు గురైన 16 మందికి (న్యాల్‌కల్, కోహీర్, ఝురాసంగం, మొగుడంపల్లి, జహీరాబాద్ మండలా లకు చెందిన) మెరుగైన చికిత్స అందుకునేందుకు శుక్రవారం కాంగ్రెస్ నాయకులు సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందచేశారు. మనియార్‌పల్లికి చెందిన పసుల వెంకట్‌కు రూ.60 వేలు, నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆర్య మల్లికార్జున్‌కు రూ.60వేలు, గొట్టిగార్‌పల్లికి చెందిన బోయ నరేష్‌కు రూ. 60 వేలు, బిలాల్‌పూర్‌కు చెందిన నాగేల్లి సమ్మయ్యకు రూ.42,500, జహీరాబాద్ పట్టణానికి చెందిన యండి ఖాద్రికి 27,500, గౌరిహ బేగంకు 37,500, మహమ్మద్ ఖలీల్‌కు 50వేలు, రబియా బేగంకు 60వేలు, గంగామనికి 37,500, మల్చెల్మా గ్రామానికి చెందిన గౌష్‌బేగంకు 50 వేలు, అర్జున్‌నాయక్ తండాకు చెందిన బానోత్ వారురాన్‌కు 45వేలు సత్వార్‌కు చెందిన బ్రహ్మణతనియాకు 60వేలు, టేకూర్ గ్రామానికి చెందిన ఆగమయ్యకు 45వేలు, న్యామతాబాద్‌కు చెందిన బిరాదార్ అప్పారావుకు 49 వేలు, చల్కిపల్లికి చెందిన మోహన్‌రెడ్డికి 60 వేల రూపాయల సిఎం ఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు శుక్రవారం అందచేశారు. కార్యక్రమం లో న్యాల్‌కల్, మొగుడంపల్లి, కోహీర్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, రామలింగారెడ్డి, మక్సూద్ అహ్మద్, పట్టణ అధ్యక్షులు కండెం నర్సింలు, నాయకులు హుగ్గెల్లి రాములు, వెంకట్‌రెడ్డి, న్యాయవాది వాజహత్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన వడిత్యా బాబు

**మనూర్, మే 2, ప్రభాతవార్త:** మనూర్ పోలీసు ఠాణాలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వడిత్యబాబు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి అందుకున్నారు. శుక్రవారం హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన వడిత్యబాబుకు డిఎస్‌పి వెంకట్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అంకిత బావంతో విధులు నిర్వహిస్తూ ఉన్నత పదవులకు చేరుకోవాలని వడిత్యబాబును డిఎస్‌పి వెంకట్‌రెడ్డి సూచించారు.

## ఆర్‌వైవిపై బ్యాంకర్లతో సమీక్షించిన ఎంపిడిఓ

**సిర్గాపూర్, మే 2, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాస పథకం(ఆర్‌వైవి)పై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో బ్యాంక్ మేనేజర్లతో ఎంపిడిఓ మల్సూర్ నాయక్ సమీక్షించారు. లబ్ధిదారులకు అందించే సబ్సిడీపై బ్యాంక్ మేనేజర్లతో ఎంపిడిఓ సమీక్షించారు. 50వేల వరకు రుణం పొందినవారికి వంద శాతం సబ్సిడీ అందచేస్తామని, 50వేల నుంచి 1లక్ష వరకు రుణం పొందిన వారికి 90 శాతం సబ్సిడీ, 1 లక్ష నుంచి 2 లక్షల వరకు రుణం పొందిన వారికి 20శాతం సబ్సిడీ, 2 లక్షల నుంచి 4 లక్షల వరకు రుణం పొందిన వారికి 70శాతం సబ్సిడీ 30 శాతం బ్యాంక్ రుణం అందించడం జరుగుతుందని బ్యాంక్ మేనేజర్లు సూచించారు. ఆన్‌లైన్‌లో ధరఖాస్తులు చేసుకున్న వారి వాటి ప్రతులను మండల పరిషత్ కార్యాలయంలో విధిగా ఇవ్వాలని ఎంపిడిఓ మల్సూర్‌నాయక్ సూచించారు. కార్యక్రమంలో వాసర్, సంజీవన్ రావపేట తెలంగాణ గ్రామీణ బ్యాంకుల, సిర్గాపూర్‌లోని ఎస్‌బిఐ మేనేజర్లు, జూనియర్ అసిస్టెంట్‌లు సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బాలవిహార్ పార్క్‌ను పరిశీలించిన కార్పొరేటర్

**రామచంద్రాపురం, మే 2, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ సండే మార్కెట్ వద్ద ఉన్న బాలవిహార్ పార్క్‌లో రూ.50 లక్షలతో నిర్మిస్తున్న ప్రహరీగోడ నిర్మాణంలో ఉన్న అడ్డంకులను కార్పొరేటర్, జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటి సభ్యురాలు పుష్పనగేష్ పరిష్కరించారు. ఈ సందర్భంగా కార్పోరేటర్ మాట్లాడుతూ పటాన్‌చెరు గాంధీ పార్క్‌వద్ద నిర్మించిన కాంపౌడ్‌వాల్ కన్నా సుందరీకరణ గా నిర్మిచాలని సూచించారు. శనివారం నుంచి ప్రహరీగోడ నిర్మాణం పనులు ప్రారంభించాలని బాధ్యులకు కార్పోరేటర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటి డైరెక్టర్ కావలి నాగేష్, సిఎం మల్లేష్, బైకణ్ నవీన్ యాదవ్, రమేష్, నర్సింలు,శ్రీకాంత్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

## జోనల్ కమిషనర్‌ను కలుసుకున్న కార్పొరేటర్...

**రామచంద్రాపురం, మే 2, ప్రభాతవార్త:** గచ్చిబౌలిలోని జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన హేమంత్ బోర్కాడే, దేవరావులను రామచంద్రాపురం కార్పోరేటర్, జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటి సభ్యురాలు బూరుగడ్డ పుష్పనగేష్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. డివిజన్ అభివృద్ధిపై కమిషనర్‌తో చర్చించి నట్లు కార్పోరేటర్ పుష్పనగేష్ వివరించారు.

## అకాల వర్షానికి 100 ఎకరాల్లో వరిపంట నష్టం : ఏవో

**గుమ్మడిదల మే 2 (ప్రభాతవార్త) :** మండలంలో గురువారం కురిసిన అకాల వర్షానికి నష్టపోయిన పంటలను మండల వ్యవసాయాధికారి పలు గ్రామాల్లో పర్యటించి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురువారం కురిసిన వడగండ్ల వానతో 100 ఎకరాల వరి పంటకు నష్టం వాటిల్లిందన్నారు. పంట నష్టాన్ని పరిశీలించి తీవ్రతను జిల్లా అధికారులకు తెలిపడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఓ.నిఖిత, ప్రణవి, అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

### బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి

**గుమ్మడిదల, మే 2(ప్రభాతవార్త) :** గురువారం కురిసిన అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బిఆర్‌ఎస్ నేత చిమ్ముల గోవర్దన్‌రెడ్డి అన్నారు.ఈమేరకు ఆయన శుక్రవారం సిజిఆర్ ట్రస్ట్ కార్యాలయంలో మాట్లాడారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్టాలను అధికారులతో సర్వేచేయించి, తక్షణ నష్టపరిహారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. పంట నష్టాలతో తీవ్ర మనోవేదనకు గురవుతున్న రైతులు ఆత్మహత్యలకు పాల్పడేపరిస్థితి తలెత్తకముందే ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈసమావేశంలమాజీ జెడ్పిటిసికుమార్ గౌడ్, ఆకుల సత్యనారాయణ, సూర్యనారాయణ, ఆంజనేయులుయాదవ్, ప్రభాకర్ రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి,ఏ.కృష్ణయాదవ్, ఆకుల బాబు, వినోద్ పాల్గొన్నారు.

## రాంసింగ్ నాయక్ తండాలో విగ్రహాల ఊరేగింపు

### -నేటి నుంచి మూడు రోజులు ఆలయంలో విగ్రహాల ప్రతిష్టాపన

**కంగ్టి, ఏప్రిల్ 2, ప్రభాతార్త:** మండల పరిధిలోని చౌకపల్లి రాంసింగ్ నాయక్ తండాలో కొత్తగా నిర్మించిన భవాని సేవాలాల్ ఆలయంలో విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమాలు ఈ నెల 3వ తేదీ నుంచి 5వ తారీఖు వరకు నిర్వహించనున్న సందర్భంగా శుక్రవారం గ్రామానికి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో చేరుకున్న విగ్రహాలను (కలశ శిఖరం,మూర్తులను) తండా వాసులు భక్తి శ్రద్దలతో విగ్రహాలను ఊరేగిస్తూ ఆలయంకుచేర్చారు.విగ్రహ ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా శేఖర్ మహారాజ్ హాజరవుతున్నట్లు ఆలయ పూజారి తారాసింగ్ మహారాజ్ తెలిపారు. మండల కేంద్రమైన కంగ్టి గ్రామం మీదుగా చౌకపల్లి రాంసింగ్ నాయక్ తండాకు చేరుకుంటున్న వాహనాన్ని గిరిజనులు సాంప్రదాయ నృత్యాలు చేస్తూ విగ్రహాలకు స్వాగతం పలికారు.

## లబ్దిదారుల ఎంపికలో అవకతవకలు

### -ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన నరోత్తం

**జహీరాబాద్, మే 2,ప్రభాతవార్త:** నియోజకవర్గానికి మంజూరైన 3500 ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక నిబంధనలకు విరుద్ధంగా ఎంపిక చేశా రని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం ఆందోళన వ్యక్తం చేశారు.శుక్రవారం కార్యాలయంలో నరోత్తం మాట్లాడుతూ గతంలోలబ్దిపొందనివారికి, ఇల్లులేనివారికి, సొంత స్థలం ఉన్న పేదలకు, దివ్యాంగులకు, ఒంటరి మహిళలకు, వితంతువులకు, అనాధలకు, పాకి పనివారికి మొదటి ప్రాధాన్యతగా ఎంపిక చేయాల్సి ఉండగా నిబంధనలకు పాతర వేస్తూ అనర్హులను ఎంపిక చేసినట్లు తెలుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికా రులు సూచించిన ప్లాన్ ప్రకారం ఇల్లు కట్టుకుంటే ప్రభుత్వం అందించే 5లక్షలుఏమాత్రం సరిపోవన్నారు. ఇల్లు పూర్తి చేసుకునేందుకు అప్పులు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు .నిబంధనల ప్రకారం అర్హులను గుర్తించి ఇండ్లు మంజూరు చేయాలని, ప్రభుత్వం అందించే 5లక్షలతో ఇల్లు పూర్తయ్యేలా ప్లాన్‌ను రూపొందించాలని నరోత్తం సూచించారు. నాయకులు జి నర్సింలు, ఎస్.గోపాల్ ఉన్నారు.

# ఆంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ

## భక్తిశ్రద్ధలతో స్వామివారికి ప్రత్యేక పూజలు



**తలకొండపల్లి మే 2ప్రభాతవార్త:**
తలకొండపల్లి మండల పరిధిలోని చౌదర్ పల్లి గ్రామంలో సుమారు 300 సంవత్సరాల క్రితం నిర్మించిన చరిత్రగల పురాతన ఆలయపునర్నిర్మాణానికి వేద బ్రాహ్మణులు నరసింహయ్య గారు,శ్రీనివాసమూర్తి అయ్యగారు ఆధ్వర్యంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో భూమిపూజ చేశారు.
ఈభూమిపూజ మహోత్సవంలో సింగల్ విండో మాజీ డైరెక్టర్ తడిసిన భాగ్యమ్మ భూపాల్ రెడ్డి,కొమిరెడ్డి కిష్టమ్మ రఘుమరెడ్డి, తడిసిన కవితకుమార్ రెడ్డి,దంపతులతో పాటు మాజీ సర్పంచ్ చంద్రయ్య,మాజీ ఎంపీటీసీ మాడుగులపెంటమ్మరామస్వామి,మాజీ సర్పంచ్ మల్లమ్మ,మాజీ ఉపసర్పంచులు కొమిరెడ్డి రాంరెడ్డి,రామారావు,యోగానంద రెడ్డి,గ్రామ పెద్దలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ.. గ్రామంలో సుమారు 300 సంవత్సరాల క్రితం నిర్మించిన ఆలయానికి ఎంతో చరిత్ర ఉన్నదని అన్నారు.మహిమగల శ్రీ ఆంజనేయ స్వామి ఆశీస్సులు గ్రామ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని కోరారు.ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని అన్నారు.స్వామి వారి ఆలయ పునర్నిర్మాణంలో గ్రామస్తులంతా తమ వంతు సహకారాన్ని అందించి త్వరితగతిన ఎలాంటి ఆటంకాలు లేకుండా ఆలయ నిర్మాణ పనులు సాగేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.
ఆలయ నిర్మాణ పూజా కార్యక్రమంలో గ్రామ పెద్దలు డిప్యూటీ తహసిల్దార్ తడిసిన హరేందర్ రెడ్డి,తడిసిన కృష్ణారెడ్డి,కొవ్వూరు రాజేందర్ రెడ్డి,తడిసిన నరేష్ రెడ్డి,ఎమిరెడ్డి శేఖర్ రెడ్డి,తడిసిన శ్రీరామ్ రెడ్డి,తడిసిన ప్రదీప్ రెడ్డి,ఎమిరెడ్డి రవికిరణ్ రెడ్డి,బోదాసు జంగయ్య,మల్గని నరసింహ గౌడ్,లక్ష్మీనారాయణ, సత్యనారాయణ,వ డ్లసత్యం, వడ్లఆచారి, దుద్దు మల్లేష్, బండారి వెంకటయ్య, చింతకాయల మల్లేష్, ఎమిరెడ్డి చందురెడ్డి, ఈశ్వర్,శ్రీశైలం,జాజాల శివ,జాజాల నరేష్, తుడుంవిష్ణు, ఆంజనేయులు, జల్లం శివరాజా, మహేష్, శంకర్, యువకులు, మహిళలు,భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## ఘనంగా ప్రిన్సిపల్ జూనియర్ జడ్జికి ఆహ్వానం



సివిల్ జడ్జికి పుష్పగుచ్ఛం అందిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

**షాద్‌నగర్, ప్రభాతవార్త,మే 2 :** షాద్‌నగర్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవిని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్ రావు నర్వ ఆధ్వర్యంలో స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి ఎస్. స్వాతిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయవాదులు జూనియర్ సివిల్ జడ్జికి కూడా అన్ని విధాలుగా సహకరిస్తామని,వారు జూనియర్,సీనియర్ న్యాయవాదులకు మార్గ దర్శకులుగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చీపిరి చంద్రశేఖర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి గుండుబావి శ్రీనివాస్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి అంతారం నర్సింలు, లైబ్రేరియన్ సెక్రెటరీ బొమ్మగల రమేష్, కోశాధికారి లింగం గౌడ్, మహిళా కార్యదర్శి జయమ్మ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీ రహీమ్ ఉద్దీన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ పబ్బె శ్రీశైలం, రెవెల్లి విజయ్ కుమార్ గౌడ్, విజయ్ భాస్కర్, బేరి శ్రీనివాస్, పత్లావత్ రూప సింగ్, బీరమోని జగన్ మోహన్ రెడ్డి, కంచి రాజగోపాల్, ఎజిపి అంజయ్య యాదవ్, చెంది మహేందర్ రెడ్డి, కేవీడీ చారి, అంజయ్య, మోహన్ రావు, శ్రీనివాస్ యాదవ్, చెట్ల శంకర్, కొరె శంకరయ్య, ఆంజనేయులు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదం ఒకరు మృతి



**ఆదిభట్ల మే 2 ప్రభాతవార్త:** ఔటర్ రింగ్ రోడ్ ఎగ్జిట్ నెంబర్ 12 వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగి ఒకరు మృతి చెందిన ఘటన ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆదిభట్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యాచారం మండలం నల్లవెల్లి గ్రామానికి చెందిన దేరంగుల తిరుమలేష్ (35) తన బ్రిజ్జా కార్లో ఉదయం హైదరాబాదులోని గచ్చిబౌలి నుండి బొంగులూరు వైపు వస్తున్నారు. అతివేగంగా రావడంతో కారు అదుపు తప్పి ఔటర్ రింగ్ రోడ్ ఎగ్జిట్ నెంబర్ 12 వద్ద డివైడర్ను ఢీ కొట్టి బోల్తాపడింది.ఈప్రమాదంలోతిరుమలేష్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.సమాచారం తెలుసుకున్న ఆదిభట్ల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

## మాల్‌లో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టరు,స్థానిక నాయకులు తదితరులు

**యాచారం మే2,ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని మాల్ గ్రామంలోని సాగర్‌రహదారిపైగల పీపుల్స్ హాస్పిటల్ నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి యాచారం సర్కిల్ ఇన్స్పెక్టర్ నందీశ్వర్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ మధు , చింతపల్లి సబ్ ఇన్స్పెక్టర్ యాదయ్య ,మర్రిగూడెం సబ్ ఇన్స్పెక్టర్ క్రిష్ణా రెడ్డి, మాల్ గ్రామపంచాయతి సెక్రటరీ రాజు హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈవేడుకకు హాజరు అయిన అతిధులను హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్స్ డాక్టర్‌భాస్కర్ సార్, వినోద్ వాళ్లని శాలువాలతో ఘనంగా సత్కారించడం జరిగింది. ఇట్టి పీపుల్ హాస్పటల్ మాల్ పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతోగానో సేవలను అందిస్తూ,ఇలాగే ముందుకు సాగాలని కొనియాడారు.. సేవలను అందిస్తూ నాణ్యమైన వైద్య సేవలు అందించి ముందుకు సాగాలని తెలిపారు.

## వర్షానికి నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

**గుమ్మడిదల, మే 2(ప్రభాతవార్త) :** మండలంలో గురువారం కురిసిన వడగళ్ల వానకు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఆకస్మికంగా కురిసిన వడగళ్ల వానవల్ల ధాన్యం,కూరగాయల తోటలు, మామిడి పండ్లు నేలమట్టమయ్యాయి. వర్షానికి దెబ్బకు రైతులు ఏ మాత్రం ఊహించని విధంగా ఒడ్లు నేలకొరిగాయి. ఈ పరిస్థితిని చూసిన ప్రతి రైతు ఆవేదన చెందుతు న్నారు. ఈ సందర్భంగా రైతు సమైఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు మద్దుల బాల్ రెడ్డి, రైతు సంఘం గ్రామ అధ్యక్షుడు సదానందరెడ్డి మాట్లాడుతూ, వడగళ్ల వర్షం రైతులను తీవ్రంగా దెబ్బతీసింది. ప్రభుత్వం తక్షణమే రూ. 50,000 మేర నష్టపరిహారం మంజూరు చేయాలని కోరారు.

## కారెక్కిన బిజెపి న్యాల్‌కల్ మండల నేతలు

**జహీరాబాద్, మే 2, ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని న్యాల్‌కల్ మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన 50 మంది బిజెపి శ్రేణులు శుక్రవారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ఆధ్వర్యంలో హైద్రాబాద్‌లో మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు సమక్షంలో బిఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కారెక్కిన బిజెపి శ్రేణులు మాజీ ఎంపిటిసి సభ్యులు దేశెట్టిపాటిల్, మాజీ సర్పంచ్, నాయకులు తుకారాం, బాస్వరం, సంగ్‌శెట్టి, సంజీవ్, అమృత్‌లను మాజీ మంత్రి హరీస్ రావుపార్టీఖండువాలుకప్పిపార్టీలోకిస్వాగతంపలికారు. బిఆర్‌ఎస్ ప్రారంభించిన బసవేశ్వర, సంగమేశ్వర ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ పాల్గొన్నారు.

## జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏడిఎ తనిఖీ

**సిర్గాపూర్, మే 2, ప్రభాతవార్త:** మండలపరిధిలోని బొక్కస్‌గాంలో సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతన్న జొన్నల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఏడిఏ నూతన్‌కుమార్ పరిశీలించారు.కేంద్రం గోదానం పరిశీలించి బాధ్యులకు పలు సూచనలు చేశారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన జొన్నల వివరాలను కేంద్రం బాధ్యులను అడిగి తెలుసుకున్నారు. రైతుల నుంచి జొన్నల కొను గోలు పారదర్శకంగా ఉండాలని సొసైటీ సెక్రటరీ సతీస్‌కు సూచించారు. రైతు లకు ఇబ్బందులు కల్గకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓశివ, రైతులు ఉన్నారు.

## వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**నర్సాపూర్, మే 2, ప్రభాతవార్త :** విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి తారా సింగ్ అన్నారు. శుక్రవారం నర్సాపూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోసమ్మర్‌క్యాంప్ శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి తారా సింగ్ మాట్లాడుతూ ఈ శిక్షణ శిబిరంలో 6 తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు చదువుతోపాటు యోగా, కరాటే, డ్రాయింగ్, పెయింటింగ్,నృత్యాలు వంటి తదితర కళాత్మక కార్యకలాపాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. శిక్షణ శిబిరానికి హాజరయ్యే విద్యార్థులకు నోట్‌పుస్తకాలు,ఎన్నులుఉచితంగా ఇవ్వడంతోపాటు అల్పాహారం అందిస్తామని ఎంఈఓ తారాసింగ్ తెలిపారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విట్టల్, పాండరీ, పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సొమ్య నాయక్, మండల ప్రధాన కార్యదర్శి భీమ్లా నాయక్, ఉపాధ్యాయులు పెంటయ్య, రవిరాజ్, సీఆర్పీలు భైరవరెడ్డి, నరసింహ చారి సుజాత తదితరులు పాల్గొన్నారు.



మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

## కుల గణన నిర్ణయం పట్ల బిజెపి హర్షం

**హుస్నాబాద్ టౌన్, మే 2, ప్రభాతవార్త :** దేశ వ్యాప్తంగా కుల గణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపట్ల బిజెపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో ప్రధాని మోడీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ నిర్వహించిన కుల సర్వే తప్పుల తడకగా ఉందని విమర్శించారు. కేంద్రం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సర్వే పకడ్బందీగా నిర్వహించడంతోపాటు దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేవిధంగా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల శంకర్‌బాబు, సంపత్ ఉన్నారు.

## కాంగ్రెస్ పాలసీనే అనుసరిస్తున్న కేంద్రం

### పార్టీ నాయకులు హరికృష్ణ, అత్తు



రాహుల్‌గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, మే 2, ప్రభాతవార్త :** సిఎం రేవంత్‌రెడ్డి సర్కారు అమలు చేసిన కులగణన పాలసీనే కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తుందని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు ఎం.డి.ఇమామ్(అత్తు) అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని 150 మంది లబ్దిదారులకు సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కులగణన సర్వేపై బిఆర్ఎస్ నాయకులు ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కారు చేపట్టిన కులగణన సర్వేను అందరూ స్వాగతిస్తున్నారని ఇది రేవంత్‌రెడ్డి విజయమన్నారు. కులగణన చేసినందులకు రాహుల్‌గాంధీ కితాబు ఇచ్చారని గుర్తు చేశారు. అనంతరం రాహుల్‌గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గంప మహేందర్‌రావు, సాకి ఆనంద్, యాదగిరి, లక్ష్మి, సతీష్‌గౌడ్, రియాజుద్దీన్, ఎల్లయం యాదవ్, షాబుద్దీన్, కలీం, పూజల గోపికృష్ణ, వహాబ్, రషీద్, సంతోష తదితరులు పాల్గొన్నారు.

## హన్మంతాపూర్ గ్రామానికి స్వాగత తోరణం ఏర్పాటు



స్వాగత తోరణం నిర్మాణానికి భూమి పూజ చేసిన అశోక్‌గౌడ్

**నర్సాపూర్, మే 2, ప్రభాతవార్త :** పట్టణంలోని 1వ వార్డు హనుమంతపూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు ప్రారంభంలో మాజీ మున్సిపల్ చైర్మన్ దుర్గాప్పగారి అశోక్‌గౌడ్ చొరవతో గిరి దీపం ఉన్నత పాఠశాల డైరెక్టర్ ప్రవీణ్‌రెడ్డి సహకారంతో స్వాగత తోరణం కమాన్ ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. ఈమేరకు ఈ స్వాగత తోరణం కమాన్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌గౌడ్ మాట్లాడుతూ స్వాగత తోరణం కమాన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ మేరకు ఇట్టి పనులు ప్రారంభించి తొందర గా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ తో పాటు పాఠశాల డైరెక్టర్ ప్రవీణ్ రెడ్డి, గ్రామస్తులు నల్ల కృష్ణ, నల్ల సంజీవ్ మల్లేష్ శేఖర్ విజయ్ శివ రాజు యాదగిరి కనకరాజు కృష్ణ రాజు యాదయ్య లక్ష్మయ్య సదానంద్ మాణిక్య రెడ్డి, నర్సింలు బాలకృష్ణ చంద్రయ్య నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రంగనాయకస్వామి రథోత్సవం



శ్రీ రంగనాయకస్వామి రథోత్సవ దృశ్యం

**మర్కుక్, మే 2 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలో వారంరోజులుగా శ్రీ రంగనాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. శుక్రవారం స్వామివారి పుష్ప రథోత్సవం డోలువాయిద్యాలు, భజనలతో గ్రామ పురవీధుల గుండా ఊరేగించగా రథాన్ని లాగడానికి భక్తులు పోటీపడ్డారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు మహా అన్న ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## బాధితురాలికి సెల్‌ఫోన్ అందజేత

**హుస్నాబాద్ టౌన్, మే 2, ప్రభాతవార్త :** ఆర్టీసీ బస్సులో ఓ మహిళ బస్‌లో సెల్‌ఫోన్ పోగొట్టుకున్న సంఘటన హుస్నాబాద్‌లో జరిగింది. వివరాల్లోకి వెళ్తే హుస్నాబాద్ నుండి రాజగోపాల్‌పేటకు శుక్రవారం ఉదయం వెల్లిన స్వరూప సెల్‌ఫోన్‌ను బస్‌లోనే మరిచిపోయిందని, రాజగోపాల్‌పేట వెళ్లిన తర్వాత సెల్‌ఫోన్ లేదని వెంటనే తిరుగు ప్రయాణమై హుస్నాబాద్ బస్టాండ్‌కు వచ్చి కంట్రోలర్‌తో విషయం చెప్పడంతో వెంటనే స్పందించిన ఆన్ డ్యూటీ కంట్రోలర్ గుగులోతు శేఖర్ బాధితురాలు బస్‌లో ప్రయాణం చేసిన టికెట్ ఆధారంగా కండక్టర్ నంబర్ సేకరించి విషయం కండక్టర్‌కు వివరించగా అదేబస్‌లో సెల్‌ఫోన్ దొరకగా హుస్నాబాద్‌కు తెప్పించి సెక్యూరిటీ వెంకటేష్‌తో కలిసి బాదితురాలికి అందజేశారు.



సెల్‌ఫోన్ బాదితురాలికి అందిస్తున్న దృశ్యం

# జాతీయరహదారి పనులకు రూ.102 కోట్లు

### -వంతెన, అండర్‌పాస్‌ల నిర్మాణానికి నిధులు
### -శంకుస్థాపన చేయనున్న గడ్కరీ: సుదర్శన్‌రెడ్డి

**ఘట్‌కేసర్, మే 2, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్‌లో ఉన్న జాతీయరహదారి (163)పై పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.102 కోట్లు మంజూరు చేసిందని బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు-ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఘట్‌కేసర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం సాయంత్రం మున్సిపల్ అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 5న అంబర్‌పేట్‌లో కేంద్ర ఉపరితల రహదారులశాఖల మంత్రి నితిన్‌గడ్కరీ ప్లై ఓవర్ వంతెన ప్రారంభోత్సవం చేయనున్నారని ఈసందర్భంగా ఘట్‌కేసర్‌లో చేపట్టనున్న పనులకు శంకుస్థాపనచేస్తారని పేర్కొన్నారు. జాతీయ రహదారిపై పోచారం మున్సిపల్ ఎన్‌టిపిసి చౌరస్తా వద్ద అండర్‌పాస్, ఘట్‌కేసర్ మున్సిపల్ పరిధిలోని ఓఆర్ఆర్ జంక్షన్ బైపాస్ రహదారి వద్ద నిర్మించనున్న వంతెన, మైసమ్మగుట్ట రోడ్డు అండర్‌పాస్, అంకుశాపూర్ రోడ్డు వద్ద హైవేపై అండర్‌పాస్‌ల నిర్మాణానికి కేంద్రం నిధులు కేటాయించిందని కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. హైవేపై వాహనాల రద్దీ విపరీతంగా పెరిగిపోవడంతో చౌరస్తాల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపరిచేందుకు తాను రాజ్యసభ సభ్యులు కె.లక్ష్మణ్, మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్‌లద్వారా కేంద్రమంత్రికి పలుసార్లు వినతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా కేంద్రం వంతెన, వియుపిలు మంజూరు చేయించినందుకు ఎంపిలకు సుదర్శన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈసమావేశంలో బిజెపి నాయకులు చెలక శ్రీధర్, దాసరి బాల్‌నర్సింహ్మా, కట్ట మధుసూధన్‌రెడ్డి, అనిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శణ్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి తదితరులు

## షాద్‌నగర్‌ని అన్నిరంగాల్లో అభివృద్ధిపరుస్తా

### -ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, మే 2, ప్రభాతవార్త:**

షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు హాజీపల్లి రోడ్డులో రూ.10 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను, 22వ వార్డులో రూ.10 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో సిసి రోడ్డు పనులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత, మాజీ మున్సిపల్ చైర్మన్‌లు నరేందర్, విశ్వం, కాంగ్రెస్ పట్టణపార్టీ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, మాజీ కౌన్సిలర్లు ప్రతాప్‌రెడ్డి, సరితాయాదగిరియాదవ్, 9వవార్డు ఇంచార్జి మాధవులుయాదవ్, నేతలు అగ్గనూరు బస్వం, ఇబ్రహీం, శ్రీశైలంగౌడ్, అందె మోహన్‌ముదిరాజ్, రాజేందర్‌రెడ్డి, ముబారక్ అలీఖాన్, సుదర్శన్, మల్లేష్, సందీప్‌గౌడ్, మన్నె రవి, వాసు, రాజేష్‌గౌడ్, ప్రదీప్, సుధాకర్‌రెడ్డి, అర్జున్, శివ పాల్గొన్నారు.

## పతకాలు సాధించిన హ్యాండ్‌బాల్ అకాడమీ



పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, కోచ్

**ఘట్‌కేసర్, మే 2, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ మున్సిపల్ అంకుశాపూర్‌లోని మహేంద్రాహిల్స్ టిజిఎస్‌డబ్ల్యుఆర్ఐఈఎస్ హ్యాండ్‌బాల్ అకాడమీ ద్వారా విద్యార్థులు 10పతకాలను సాధించారు. అదిలాబాద్‌జిల్లా మందమర్రిలో జరిగిన 54వ రాష్ట్ర సీనియర్ మహిళా హ్యాండ్‌బాల్ చాంపియన్ పోటీలలో విద్యార్థులు పాల్గొని ఉత్తమ ఆటతీరును ప్రదర్శించారు. రంగారెడ్డి, వరంగల్, ఖమ్మం జిల్లాలకు చెందిన క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. రంగారెడ్డి జిల్లా రెండవ స్థానం సాధించగా బి.కల్పన(సంగారెడ్డి), బి.జ్యోతి(ఇబ్రహీంపట్నం), ఆర్.సాయికృష్ణ (మహేంద్రాహిల్స్), మూడవ స్థానంలో బి.కావ్య, ఎం.త్రివేణి, ఐశ్వర్య , రవి (వరంగల్ వెస్ట్), నాలుగవ స్థానంలో బి.మీనాక్షి, బి.నందిని, ఎస్.శ్రీలత (కొత్తగూడెం) విద్యార్థులు పతకాలను సాధించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ స్నేహలత, ఆర్‌డిసి మహేంద్రాహిల్స్, డాక్టర్ రామలక్ష్మణ్, శేషకుమారీ సహకారంతో పతకాలు సాధించారని కోచ్ పద్మినిగుప్త తెలిపారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్సీ

**గజ్వేల్ టౌన్, మే 2 (ప్రభాతవార్త):** గజ్వేల్ పట్టణానికి చెందిన రహూఫ్ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందగా ఎక్కువ మొత్తంలో ఖర్చు కావడంతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ.60వేల చెక్కును శుక్రవారం ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జకియొద్దీన్ తదితరులు ఉన్నారు.

## త్వరలో బతుకమ్మ కుంటకు సిఎం

**హైదరాబాద్, మే 2,ప్రభాతవార్త:**

బతుకమ్మకుంట అభివృద్ధిపనుల వేగాన్నిపెంచాలని, కొద్దిరోజుల్లో సిఎం రేవంత్‌రెడ్డి బతుకమ్మకుంటను సందర్శించనున్నారని... అప్పటివరకూ చెరువు రూపాన్ని తీసుకురావాలని హైడ్రాకమిషనర్ రంగనాథ్ సూచించారు. శుక్రవారం బతుకమ్మకుంట పనులను హైడ్రాకమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బతుకమ్మకుంటను రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అభివృద్ధి చేస్తోందని కమిషనర్ చెప్పారు.

## హరీష్‌రావుని మర్యాదపూర్వకంగా కలుసుకున్న కేశంపేట నాయకులు



హరీష్‌రావుని కలిసిన నాయకులు

**కేశంపేట, మే 2, ప్రభాతవార్త:**

తెలంగాణ మాజీమంత్రి హరీష్‌రావుని శుక్రవారం హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కేశంపేట మండల మాజీ జెడ్పిటిసి పల్లె నర్సింగరావు, షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌కమిటీ మాజీ వైస్‌ప్రెసిడెంట్ వర్కాల లక్ష్మీనారాయణగౌడ్ కలిశారు. ఈసందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ వరంగల్‌సభను విజయవంతం చేసేందుకు కృషిచేసిన మీ అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారని రాబోయే కాలంలో బిఆర్ఎస్‌పార్టీ అధికారంలో ఉంటుందని టిఆర్ఎస్ కార్యకర్తలు అధైర్యపడద్దని, ధైర్యంగా ఉండాలని కార్యకర్తలకు ఏ కష్టంవచ్చినా ఆదుకుని అన్నివిధాలుగా అండగా ఉంటానని అన్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కేశంపేట మండల బిఆర్ఎస్ నాయకులు కొండారెడ్డిపల్లి యువ నాయకులు ప్రేమ్‌కుమార్‌గౌడ్, జగన్మోహన్‌రెడ్డి, దశరత్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలను అధికార యంత్రాంగం పాటించాలి : ఎమ్మెల్యే

**అల్వాల్, మే 2, ప్రభాతవార్త:** కనీస సదుపాయాలు లేకుండా బహుళ అంతస్తుల భవనాలకు అనుమతులు మంజూరు చేస్తుండడం సమస్యలకు కారణంగా మారుతోందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని ఫార్చ్యూన్ ఎవెన్యూ కాలనీని అధికార యంత్రాంగంతో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. ఎగువ ప్రాంతాలు నుంచి వస్తున్న మురికి నీరు తమ కాలనీని ముంచెత్తుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక పోయినా భారీ నిర్మాణాలకు జిహెచ్‌ఎంసి అనుమతులు ఇచ్చిన కారణంగా సమస్య తీవ్రతరం దాల్చిందని స్థానికులు వాపోయారు. తక్షణం డ్రైనేజీ వ్యవస్థకు పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే మర్రి అధికారులను ఆదేశించారు. భవన నిర్మాణ అనుమతులు సందర్భంగా నిబంధనలను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ చిన్నారెడ్డి, ఇఇ శ్రీక్రాంతి, జలమండలి జనరల్ మేనేజర్ సునీల్, డిజిఎం రాజు,డిఇ రఘు,ఎఇ లక్ష్మీభాయి బిఆర్ఎస్ నేతలు డోలి రమేష్, లక్ష్మణ్‌యాదవ్, పరమేష్ ఇతరులు పాల్గొన్నారు.

## శానిటేషన్‌పై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలి


### కమిషనర్ కర్ణన్

**హైదరాబాద్, మే 2,ప్రభాతవార్త:**

శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిహెచ్ ఎంసి కమిషనర్ ఆర్. వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఈమేంˊకు శుక్రవారం ఖైరతా బాద్ జోనల్ కమీషనర్ అనురాగ్ జయంతి తో కలిసి తెలుగు తల్లి ప్లైఓవర్, లోయర్ ట్యాంక్ బండ్ ట్రాన్స్ఫర్మర్ పాయింట్, ఖైరతాబాద్ బడా గణేష్, ఖైరతాబాద్ పార్కులో పలు అభివృద్ధి పనులతో పాటు శానిటేషన్ ను కమిషనర్ పరిశీలించారు. బడా గణేష్ ప్రాంతంలో శానిటేషన్ వర్కర్లతో కమీషనర్ మాట్లాడారు. అక్కడే ఎఫ్.ఆర్.ఎస్ అటెండెన్స్ పరిశీలించారు. అటెండెన్స్ హాజరు, ఆబ్సెంట్ పరిస్థితి పరిశీలన చేసారు. అదేవిధంగా స్వచ్ఛ ఆటో డ్రైవర్‌లతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీఐడీ కాలనీ వద్దకు వెళ్లి అక్కడ కాలనీ వాసులతో మాట్లాడారు. శానిటేషన్ కార్మికులు రోజు వస్తున్నారా అని ఆరా తీశారు. ప్రతి రోజు వస్తున్నారని కాలనీ వాసులు కమిషనర్ కు తెలిపారు. పక్కనే ఉన్న పార్కును పరిశీలించి పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసు కోవాలన్నారు. అక్కడి నుండి నేరుగా సెక్రెటరీయేట్ పరిసరాలను పరిశీలిం చారు. తెలుగు తల్లి ప్లైఓవర్ తో పాటుగా లోయర్ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న ఎస్.సి.టి.పి ని సందర్శించి రాంకీ వారితో మాట్లాడి వివరాలు తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా కమిషనర్ వారికి పలు సూచనలు చేశారు. కమిషనర్ వెంట జోనల్ కమీషనర్ అనురాగ్ జయంతి, ఖైరతాబాద్ డిప్యూటీ కమీషనర్ రజనీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

# వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషిచేస్తా

### -నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జ్ వజ్రేశ్ యాదవ్
### -వెంకటాపూర్ శ్రీబాలాజీ దేవాలయ కమిటీసభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం



సభ్యులచేత పదవీప్రమాణంచేయిస్తున్న ఈవో భాగ్యలక్ష్మి, చిత్రంలో నియోజకవర్గ కాంగ్రెస్‌ఇంఛార్జ్ వజ్రేశ్‌యాదవ్

**ఘట్‌కేసర్ రూరల్, మే 2, ప్రభాతవార్త:**

శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి నూతనంగా ఎంపికకాబడిన పాలకవర్గంతోపాటు తన వంతు కృషిచేస్తానని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జ్ తోటకూర వజ్రేశ్‌యాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్ శ్రీ బాలాజీవేంకటేశ్వరస్వామి ఆలయకమిటీ నూతన పాలకవర్గసభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తోటకూర వజ్రేశ్‌యాదవ్ సమక్షంలో ఆలయ ఈవో ఎల్.భాగ్యలక్ష్మి నూతనంగా ఎంపికకాబడిన ఆలయకమిటీ చైర్మన్ చింతపంటిసత్తయ్యయాదవ్,డైరెక్టర్లువెంకటేశ్‌ముదిరాజ్, లావణ్య, ఆంజనేయులు, సుధాకర్‌లచే ఆలయ ఆవరణలో ప్రమాణస్వీకారం చేయించారు. బి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల మహేశ్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నియోజకవర్గ ఇంఛార్జ్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం చేత నిధులు కేటాయించి అభివృద్ధిచేయిస్తానని అన్నారు. కొత్తగా ఎంపిక కాబడిన పాలకవర్గ సభ్యులు ఐక్యతగా ఉండి గ్రామపెద్దల సహకారంతో ఆలయాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయాలని అన్నారు. ఆలయకమిటీ చైర్మన్ చింతపంటి సత్తయ్య యాదవ్ మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. ఆలయ అభివృద్ధికి దాతలు దాదాపు రెండుకోట్లరూపాయలు ఖర్చు పెట్టాడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. దాతల సహాయంతో రాష్ట్రప్రభుత్వం సహాయంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేశ్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కర్రె రాజేశ్, మున్సిపల్ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మెట్టు గణేశ్‌యాదవ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బాలగోని వెంకటేశ్‌గౌడ్, సింగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్లు గోపు బాలయ్య, రేసు లక్ష్మారెడ్డి, జడిగే రమేశ్‌యాదవ్, మాజీ ఎంపిటిసి బుర్ర వెంకటేశ్‌గౌడ్, గ్రామ సర్పంచ్‌లు ఉదారి వేణుగోపాల్‌ముదిరాజ్, నాయకుడు నీరుడి శ్రీనివాస్ ముదిరాజ్, కట్టా సత్యనారాయణగౌడ్, మారం లక్ష్మారెడ్డి, సహదేవ్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

## బీరప్పస్వామి ఆలయానికి కొత్త ఒరవడి



కలశాలతో ఆలయకమిటీ అధ్యక్షులు సత్యనారాయణ

**కొత్తూర్, మార్చి 2, ప్రభాతవార్త:**

బీరప్ప ఆలయంలో ఘనంగా ప్రాణప్రతిష్ఠ ధ్వజస్తంభ ఆవిష్కరణ కురుమ కులస్థుల క్రతువుతో ఎస్‌బిపల్లి ఆలయం పునీతం. కొత్తూర్ మండల పరిధి లోని శేరిగూడ, భద్రాయపల్లిగ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీకామరాతిదేవిసమేత శ్రీబీరప్పస్వామి ఆలయంలో పునర్నిర్మాణ ప్రారంభోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా శుక్రవారం నిర్వహించిన జలధివాసం అనంతరం ప్రధానదేవతలైన బీరప్ప, కామరాతీదేవి విగ్రహాలతోపాటు ఉప ఆలయాలకుచెందిన మహంకాళి, బుగ్గపోచమ్మ విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ ఆచరించారు. ఆలయంముందు ఏకశిల ధ్వజస్తంభం, గర్భాలయ గోపురాలపై శిఖర కలశాలు ఏర్పాటుచేయడం విశేషం. ఈకార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్షులు ఎమ్మె సత్యనారాయణ సమర్థవంతంగా నిర్వహించారు. ఈవేడుకలో మాజీ జడ్పిటిసి మాజీ సభ్యురాలు శ్రీలత, కడల శ్రీశైలం, ఎమ్మె వెంకటయ్య, ఎమ్మె అజయ్, కుమ్మరిగూడెం పాండు, ఎమ్మె బాల్‌రాజ్, గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు.

## రోడ్లపై ధాన్యం ఆరబెట్టవద్దు : ఎస్ఐ దామోదర్

**మర్కుక్, మే 2 (ప్రభాతవార్త):** రైతులు పండించిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టి ప్రమాదాలకు కారణం కావద్దని మర్కుక్ ఎస్ఐ దామోదర్ తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని వివిధ గ్రామాల రైతులు రోడ్లపై ధాన్యం ఆరబెట్టడం జరుగుతుందని అన్నారు. దీనివల్ల రోడ్లపై వచ్చిపోయే వాహనాలకు ఇబ్బంది కలుగుతుందని, అలాగే ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయే అవకాశం ఉంటుందన్నారు. రాత్రి వేళల్లో రోడ్లపై ధాన్యాన్ని కుప్పగా చేసి దానిపై నల్లటి కవర్ కప్పడంతో వాహనదారులకు కనిపించకుండా ఎన్నో ప్రమాదాలు జరిగాయని, కావున రైతులు పొలాల వద్ద లేదా ఇంటి వద్ద ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని సూచించారు. ఎవరైనా రోడ్లపై ధాన్యం ఆరబెట్టినట్లయితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**బెజ్జంకి, మే 2, ప్రభాతవార్త :** మండల కేంద్రానికి చెందిన టేకు రంగవ్వ అనే మహిళ ఇటీవల పిడుగుపాటుకు గురై మృతి చెందగా, గుండారం గ్రామా నికి చెందిన కొరికొప్పుల నారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శుక్రవారం బాధిత కుటుంబీకులను మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షులు పాకాల మహిపాల్ రెడ్డి, నాయకులు లింగాల లక్ష్మణ్, ఫాక్స్ వైస్ చైర్మన్ బండి రమేష్, నాయ కులు ముక్కిస రాజిరెడ్డి, పెద్దన్న, బండిపెల్లి రాములు, తాటిచెట్టు భూమయ్య, బొమ్మకంటి రామలింగారెడ్డి, గుండారం గ్రామశాఖ అధ్యక్షులు కత్తి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

### -వంటిమామిడి ఏఎంసి చైర్మన్ విజయ మోహన్

**ములుగు, మే 2 (ప్రభాతవార్త):** పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభు త్వం కృషి చేస్తుందని వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్ అన్నారు. శుక్రవారం మండల పార్టీ అధ్యక్షుడు తమ్మలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ములుగు రైతు వేదికలో మండలానికి సంబంధించిన కళ్యాణ లక్ష్మి, షాదిముబారక్ లబ్ధిదారులు 116 మందికి మండల తహసీల్దార్ ఆరీఫాతో కలిసి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఏఎంసి చైర్మన్ విజయ మాట్లాడుతూ మండలంలో మొత్తం 135 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులు మంజూరు కాగా 116 మందికి అంద జేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ సీనియర్‌నాయకులు సయ్యద్ సలీం, కొన్యాల బాల్‌రెడ్డి, తారక సురేష్, నరసింహారెడ్డి, రాములు, మహంకాళి, పోచయ్య, బాల్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బ్రిడ్జిపై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

### -కుటుంబ కలహాలే కారణమా..? అనుమానం

**శామీర్‌పేట, మే 2, ప్రభాతవార్త:**

శామీర్‌పేట పెద్దచెరువుకట్ట రాజీవ్‌రహదారిన ఉన్న బ్రిడ్జిపైనుంచి కిందకు ఓవ్యక్తి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 2గంటల సమయంలో శామీర్‌పేట చెరువుకట్ట బ్రిడ్జికింద పడి ఓవ్యక్తి మృతిచెంది ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందటంతో పోలీసులు చేరుకుని విచారణ చేపట్టారు. శామీర్‌పేట పోలీసుల కథనం ప్రకారం సిద్దిపేట్ జిల్లా జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పోచంపల్లి హనుమంతు (48) ఇతను క్యాబ్‌డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం ఉందని పోలీసులు పేర్కొన్నారు. అయితే అతనికి కుటుంబ కలహాలు ఉండటం వల్లనే శామీర్‌పేట పెద్దచెరువు కట్టమైసమ్మ బ్రిడ్జి వద్దకు వచ్చి బ్రిడ్జిపై నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నట్లుగా ప్రాథమికంగా తెలుస్తుందని పోలీసులు పేర్కొన్నారు. ఆత్మహత్య చేసుకున్న మృతునికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందన్నారు. శామీర్‌పేట పెద్దచెరువుకట్టవద్ద రాజీవ్ రహదారిన ఉన్న బ్రిడ్జిపైనుంచి కిందకుదూకి పోచంపల్లి హనుమంతు ఆత్మహత్య చేసుకోవటం అందరిని ఆశ్యర్యానికి గురిచేసి కలవరపర్చింది. శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నగల దొంగను అదుపులోకి తీసుకున్న పోలీసులు




వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి శ్రీనివాస్

**పరిగి, మే 2, ప్రభాతవార్త:**

వికారాబాద్ జిల్లా పరిగి పట్టణ ఆర్టీసీ బస్టాండ్ లో ఏప్రిల్ 17వ తేదీన ప్రయాణికుల మెడలోంచి బంగారునగలు, నగదును దొంగిలించిన ముఠాను శుక్రవారం పరిగి పోలీసులు అరెస్టు చేశారు. పరిగి డిఎస్‌పి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పత్రిక సమావేశం నిర్వహించి, వివరాల తెలిపారు. సిద్ధాపూర్ గ్రామం, ఆత్మకూరుమండలం, నంద్యాలజిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గుంజల గిద్దన్న, తన భార్య ఆగిరమ్మ, వారి కూతురు కీర్తి, గిద్దన్నబావ ప్రసాద్, నలుగురుకలిసి రద్దీగా ఉండే ప్రదేశాలలో, కావాలని గందరగోళాన్ని సృష్టించి, ప్రయాణికుల దృష్టి మళ్లించి, నగదు, నగలను దొంగతనం చేస్తుంటారని, ఏప్రిల్ 17వ తేదీన బస్టాండ్‌లో ఇదేవిధంగా దొంగతనం చేసి స్వగ్రామానికి పారిపోయారని, బాధితుల ఫిర్యాదుతో విచారణ చేపట్టిన పోలీసులు, సిసి కెమెరాలు పాత నేరస్తుల వివరాలు సేకరించి ముందుగా మూడురోజుల క్రితం ఆగిరమ్మ, కీర్తి, ప్రసాద్‌లను పట్టుకొని విచారించగా నేరం అంగీకరించారని, ప్రధాన నిందితుడు గిద్దన్నను శుక్రవారం అరెస్టు చేయగా... గిద్దన్న నుండి మూడు తులాల బంగారు గుండ్లమాల, 13వేలరూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామని తదుపరి విచారణగురించి మేజిస్ట్రేట్‌ముందు హాజరు పరుస్తామని డిఎస్పి శ్రీనివాస్ తెలిపారు. కేసును చాకచక్యంగా ఛేదించిన పరిగి ఎస్ఐ సంతోష్‌కుమార్, సిబ్బంది గోపాల్, జావీద్ , బొంరాస్పేట్ బాలు నాయక్‌లను అధికారులు అభినందించారు.